ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు



బాపట్ల : జమ్ములపాలెం రోడ్డులో జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

పునాదులకే.. సంబరాలా?

- మెడికల్ కళాశాల శంకుస్థాపనకు రెండేళ్లు దాటాయి..
- 2023 చివరికల్లా పూర్తి చేస్తామన్న పాలకుల మాటలు ప్రగల్భాలే
- పునాదుల దశలోనే వైద్య కళాశాల పనులు
- 2025 - 26కల్లా అందుబాటులోకి అంటూ కొత్త పల్లవి
- కేటాయించిన స్థలం మీద పలు ఆరోపణలు

శంకుస్థాపనలప్పుడు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించడం.. తర్వాత వాటిని అటకెక్కించడం ప్రస్తుత ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్యలా తయారైంది. 2021 మే చివరన పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లి సమీపంలో, బాపట్ల పట్టణ శివారులోని జమ్ములపాలెం రోడ్డులో మెడికల్, నర్సింగ్ కళాశాలలతో పాటు టీచింగ్ హాస్పటల్‌కు సీఎం జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. రెండేళ్లలోపు మెడికల్ కళాశాల, ఆసుపత్రి పూర్తి చేస్తామని ఆనాడు ఎంతో గొప్పలు చెప్పినా అవి ఆచరణలో కనిపించడం లేదు. నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. శంకుస్థాపన చేసిన తర్వాత రెండేళ్ల వరకు అటువైపు పాలకులు కన్నెత్తి చూడలేదు. ఆరు నెలల క్రితం నుంచే వాటి పనులు ప్రారంభించారు. ప్రస్తుతానికి ఫిల్లర్ల దశలో మెడికల్ కళాశాల పనులు ఉన్నాయి. ఇప్పుడు 2025 - 26 కల్లా మెడికల్ కళాశాల సేవలను అందుబాటులోకి తెస్తామనే మాటలు చెబుతూ ఎన్నికల సమీపిస్తున్న వేళ మరో గారడీకి తెరలేపారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బాపట్ల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల కిందట బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మెడికల్ కాలేజీల నిర్మాణాలకు సీఎం జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేశారు. ప్రభుత్వం అందుబాటులోకి తెస్తానన్న మెడికల్ కళాశాల అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలకు అత్యవసర వైద్యం కష్టాలు తప్పడం లేదు. బాపట్లలోని ఏరియా ఆసుపత్రిలో అత్యవసర వైద్యానికి కావాల్సిన సదుపాయాలు, నిపుణులైన డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రాణాలొదులుతున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో పెరిగింది. గతేడాది టెన్త్ మూల్యాంకనం కోసం బాపట్ల వచ్చిన ఉపాధ్యాయుడు గుండెపోటుతో మరణించగా తొలుత అతనిని ఏరియా ఆస్పత్రికే తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు రిఫర్ చేయగా మార్గ మధ్యంలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారు. సకాలంలో వైద్యం అంది ఉంటే ఆ ఉపాధ్యాయుడు బతికేవారని అభిప్రాయం అప్పుడు వ్యక్తమైంది. ప్రాణాపాయ సమయాల్లో బాపట్లలో వైద్యం అందకపోవడంపట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శంకుస్థాపన చేసిన వెంటనే..

మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేసిన వెంటనే పనులు మొదలుపెట్టి ఉంటే ఈ పాటికే ప్రజలకు సేవలు అందుబాటులోకి వచ్చేవని, కానీ ప్రభుత్వం రెండేళ్ల పాటు నిర్మాణం ఊసే ఎత్తలేదని ప్రజలు మండిపడుతున్నారు. పెరిగిన వైద్య అవసరాలకు తగ్గట్లు బాపట్లలో సదుపాయాలు లేవని, ఏరియా ఆసుపత్రిని జిల్లా వైద్యశాలగా మార్చే అంశం మీద కూడా పాలకులు దృష్టిపెట్టకుండా మెడికల్ కళాశాల అందుబాటులోకి వస్తోందంటూ మోసపూరిత ప్రకటనలకే పరిమితమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గడచిన ఆరు నెలల నుంచి మెడికల్ కళాశాల పనుల్లో కదలిక ప్రారంభమైంది. అంతకు ముందు వరకు అతీగతీ లేదు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజల నుంచి వచ్చే విమర్శలు తప్పించుకోవడానికే పనులు మొదలుపెట్టారని చిత్తశుద్ధి ఉంటే ప్రారంభించిన సంవత్సరంలోనే నిర్మాణం చేపట్టేవారనే అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేయడం గమనార్హం.



పునాదుల్లోనే జమ్ములపాలెం రోడ్డులో జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

కేటాయించిన స్థలంపై ఆరోపణలు

మెడికల్ కళాశాల నిర్మాణం కోసం బాపట్ల పట్టణ శివారులోని జమ్ములపాలెం రోడ్డులో 50 ఎకరాల స్థలం కేటాయించారు. ఓ దాత విరాళంగా ఆ భూమిని ఇచ్చారని చెబుతున్నారు. అదంతా అసైన్డ్ భూమిగా ప్రభుత్వ రికార్డుల్లో నిక్షిప్తమై ఉంది. ఆ భూమే అసైన్డ్ అయినప్పుడు చేతులు మార్చుకున్న వ్యక్తి వాటిని వితరణగా ఇవ్వడమేంటో అన్నదానికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. ఈ భూమి కేటాయింపులో రియల్ ప్రయోజనాలే ఎక్కువగా పని చేశాయనే విమర్శలు ఉన్నాయి.

ప్రతిబంధకంగా ఎన్‌ఎంసీ ఆంక్షలు

ప్రభుత్వం సకాలంలో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టకపోవడం వల్ల కొత్త చిక్కు కూడా వచ్చిపడింది. ప్రతి పదిలక్షల జనాభాకు 100 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉండాలన్న జాతీయ వైద్య కమిషన్(ఎన్‌ఎంసీ) నిబంధనలు భవిష్యత్తులో ప్రారంభించబోయే వైద్య కళాశాలలకు గొడ్డలి పెట్టు కానుంది. మరో మూడేళ్లలో వీటి నిర్మాణం పూర్తయినా ఎన్‌ఎంసీ కొత్తగా తీసుకొచ్చిన ఆంక్షల వల్ల తరగతులు ప్రారంభం కావడం కూడా కష్టమేనని అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్త చేస్తున్నారు. ఇన్ని బాలారిష్టాలను దాటి బాపట్లలో మెడికల్ కళాశాల సేవలు అందుబాటులోకి రావాలంటే ఇంకెన్నాళ్లు ఎదురు చూడాలో అని ప్రజానీకం వాపోతోంది.

30 శాతమే పనులు పూర్తి..

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 5: పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లి సమీపంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మెడికల్ కళాశాల మొత్తం రెండున్నర లక్షల చదరపు అడుగులలో నాలుగు బ్లాక్‌లలో నిర్మాణాలు చేయాల్సి వుండగా శ్లాబులు పూర్తయ్యాయి. మూడు బ్లాక్‌లలో పని నత్తనడకన కొనసాగుతున్నాయి. మెడికల్ ఆసుపత్రి నిర్మాణం కూడా ఆరు బ్లాక్‌లుగా విభజించగా ఐదు బ్లాక్‌లు కొంతమేర పనులు పూర్తయ్యాయి. మొత్తం మీద మెడికల్ కళాశాల, ఆసుపత్రి భవన నిర్మాణాలు రెండు సంవత్సరాల 8 నెలలకు 30 శాతమే పూర్తయ్యాయి. మొత్తం భవనాలకు శ్లాబులు వేయగా లోపల పార్టీషియన్‌లు, ఇంకా కొంతపని చేయాల్సి వుంది. ఈ ఏడాది ఆఖరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ 30 శాతం పనులు చేసేందుకే మూడేళ్లు గడిస్తే మిగిలిన 70శాతం పనులు చేసేం దుకు ఇంకెన్నేళ్లు పడుతుందో. మెడికల్ కాలేజి ముందుభాగం వరకు త్వరితగతిన మొక్కుబడిగా పనులు పూర్తిచేసి రంగులు వేస్తున్నారు. ఎన్నికల కోడ్ రాకముందే వర్చువల్ విధానంలో మెడికల్ కళాశాలను సీఎం జగన్‌చే ప్రారంభించేం దుకు నేతలు సన్నద్ధమవుతున్నారు.



పిడుగురాళ్ల: బ్రాహ్మణపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల

ఊగిసలాట!

- పర్చూరుపై వైసీపీ మంతనాలు
- ఆమంచిని పిలిచి మాట్లాడిన అధిష్టానం
- తొలుత ముఖ్య నాయకులు, ఆపై సీఎంతో భేటీ

చీరాల, ఫిబ్రవరి 5: చీరాల మాజీ ఎమ్మెల్యే, వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ సోమవారం సీఎంవో పెద్దలను కలిశారు. వారి మధ్య జరిగిన చర్చపై స్పష్టత లేకపోయినప్పటికీ ఆమంచి అనుచరులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పర్చూరు నియోజవర్గ అభ్యర్థిగా కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించాలనేది సీఎం జగన్ మొదటి నుంచి చెప్తున్న మాట. అందులో భాగంగానే ఆమంచిని పర్చూరు ఇన్‌చార్జ్‌గా నియమించారు. అయితే, అప్పట్లో తనకు కొన్ని హామీలు ఇచ్చారని, వాటిని నెరవేర్చాలని ఆమంచి పట్టుబడుతున్నట్లు ఆయన సన్నిహితులు చెప్తున్నారు. ఇదేఅంశాన్ని సీఎంవో పెద్దలతో పాటు, సీఎం జగన్‌కు కూడా తెగేసి చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఆక్రమంలో ఆమంచి తాను చీరాల నుంచి పోటీ చేస్తాననే మాటను అంతరంగికులకు చెప్పటంతో విషయాన్ని తానే తెగేదాక తెచ్చుకున్నట్లు భావించిన అధిష్టానం వెంటనే ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టింది. ఆ క్రమంలో గొట్టిపాటి భరత్‌తో పాటు పలుపేర్లు తెరపైకి వచ్చాయి. అప్పట్లో మాజీ మంత్రి బాలినేని పర్చూరు ఇన్‌చార్జ్ విషయంలో ఆమంచిని వ్యతిరేకించారు. మరో కాపు సామాజికవర్గ అభ్యర్థిని సూచించాలని ఆ బాధ్యతను బాలినేనికే జగన్ అప్పగించారు. అది కార్యరూపం దాల్చలేదు.

ఆధిపత్య పోరులో భాగమేనా?

ఇదిలాఉంటే చీరాల నియోజక వర్గంలో ఆమంచి అనుచరులు ఒక్కొక్కరుగా వైసీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ తో జతక డుతున్నారు. రెండురో జుల క్రితం ఆమంచికి అత్యంత సన్నిహితులుగా గుర్తింపు పొం దిన వారిలో గరికపాటి సుధీర్, పైడి రాజేష్, కౌన్సిలర్ సత్యానందం లు వెంకటేష్, ఎమ్మెల్యే బలరాంలను కలసి తమ మద్దతు తెలి పారు. అంతకు ముందు ఆమంచి శిబిరంలోని కొందరు కౌన్సిల ర్లు, నాయకులు వెంకటేష్‌తో కలసి ప్రయాణం చేస్తున్నారు. ఈక్రమంలో మిగిలిన కౌన్సిలర్లు, పలువురు నాయకులు సోమవారం ఆమంచిని కలసి తాము మీరు ఏ నిర్ణయం తీసుకున్నా మీతో కలసి ప్రయాణం చేస్తామని, చెప్పినట్లు తెలిసింది. ఆతరువాత ఆమంచి సీఎంవోకు వెళ్లారు. ఈ సమావేశం లో కూడా సీఎంవో పెద్దలకు తాను మొదటి నుంచి ఏ స్టాండ్ మీద ఉన్నానో, అదే స్టాండ్ మీద ఉంటానని చెప్పనున్నట్లు ఆమంచి వారికి చెప్పినట్లు తెలిసింది. అయితే, ప్రత్యక్షంగా, పరోక్షంగా పర్చూరు నియోజకవర్గంలో ఆ మంచికి స్వపక్షంలోనే వైరివర్గీయులు దండిగా ఉన్నారు. చీరాల నియోజకవర్గంలో ఉన్న అను చరులు ఒక్కొక్కరుగా జారిపోతున్నారు.

ఈ నేపథ్యంలో ఆమంచి రెండు నియోజకవర్గాల్లో ద్విపాత్రాభి నయం కొనసాగిస్తారో.. తెరదించు తారో వేచి చూడాల్సిందేనని రాజకీయ విశ్లేషకు లు అంటున్నారు. అయితే, పైకి కనిపించేది ఆమంచి, ఇతరత్రా పేర్లు ఉన్నా.. వాస్తవానికి ఇదంతా బాలినేని, వైవీ సుబ్బారెడ్డిల మధ్య ఆధిపత్య పోరులో భాగమేనని రాజకీయ వర్గాలతో పాటు వైసీపీ వర్గీయులు కూడా కొందరు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

బస్సు యాత్ర సందర్భంలో..

ఈనేపథ్యంలో వైవీ సుబ్బారెడ్డి ఆశీస్సులతో ఆమంచి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు ప్రచారం జరిగింది. చీరాలలో వైసీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా కరణం వెంకటేష్ పేరును ఆ యాత్రలో పాల్గొన్న పలువురు నేతలు చీరాల వైసీపీ అభ్యర్థిగా ప్రకటించటంతో ఆమంచి ఉలికిపాటుకు లోనయ్యారు. వెంటనే సీఎంవో పెద్దలను కలిశారు. తన వాదనను వినిపించారు. అయితే, వారినుంచి సానుకూల స్పందన రానట్లు సమాచారం. ఈక్రమంలో వైసీపీ పెద్దలు, సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించటంతో పాత, కొత్త పేర్లు కొన్ని తెరపైకి వచ్చాయి. దీంతో ఆమంచి మరలా సీఎంవో పెద్దలను కలసి తన మనోగతాన్ని వివరించారు.

అవునన్నారా, కాదన్నారా..?



ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పర్చూరు వైసీపీ అభ్యర్థి ఎంపికపై అధిష్టానంలో ఊగిసలాట ధోరణి కనిపిస్తోంది. ప్రస్తుతం అక్కడ ఇన్‌చార్జిగా చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఉండగా ఇటీవల మరికొందరిని అధిష్టానం పిలిచి మీరు పోటీ చేసేందుకు సిద్ధమా? అంటూ అడిగారు. సోమవారం ఆమంచిని కూడా అధిష్టానం పిలిచి రాష్ట్ర నాయకులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. చీరాల టికెట్‌ను పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే బలరాం కుమారుడు వెంకటేష్‌కు ఓకే చెప్పిన జగన్ పర్చూరు నుంచి ఆమంచినే రంగంలోకి దింపాలన్న ఆలోచనలో ఉన్న విషయం తెలిసిందే. పర్చూరు ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే అనేక ఆరోపణలు రావటమే గాక సొంత పార్టీ నాయకుల నుంచే ఆమంచి విమర్శలను ఎదుర్కొన్నారు. దీనికితోడు నియోజకవర్గంలో ప్రధానమైన కమ్మ సామాజికవర్గం నేతలను దూషించటం, వ్యాపారులను వేధించటం లాంటి చర్యలకు పాల్పడ్డారు. గత పక్షంరోజులుగా ఆయన పర్చూరు నుంచి కాకుండా చీరాల నుంచే పోటీ చేసే ఆలోచనలో ఉన్నారన్న సంకేతాలు ఇచ్చారు. ఒకటి రెండుసార్లు చీరాలలో తన అనుచరులతో సమావేశమై అలాంటి సంకేతాలిచ్చారు. తదనంతరం సీఎం జగన్ మాజీ ఎమ్మెల్యే, దివంగత గొట్టిపాటి నరసయ్య కుమారుడు భరత్‌ను పిలిపించుకుని పోటీకి సిద్ధమా అయితే ఇంత ఆర్థికవ్యయాన్ని భరించగలరా అని అడగటం తెలిసిందే. ఆర్థికాంశాలలో కొంత ఆయన వెనక్కు తగ్గినట్లు తెలిసింది. ఆదివారం మరికొందరికి ఫోన్ చేసి పర్చూరు నుంచి రంగంలోకి వచ్చేందుకు సిద్ధమా అని మాట్లాడినట్లు తెలిసింది. కమ్మ సామాజికవర్గం నుంచి మాజీ ఇన్‌చార్జి రామనాథంబాబు, చిలకలూరిపేటకు చెందిన సురేష్ అనే వ్యాపారవేత్త రేసులో ఉన్నప్పటికీ వారిని పక్కనపెట్టి వేరే సామాజికవర్గం వారికి ఫోన్లు చేసి పర్చూరులో అవకాశం ఇస్తే పోటీ చేస్తారా? అని అధిష్టానం నాయకులు మాట్లాడటం విశేషం. ఒంగోలులో కాపు సామాజికవర్గ వ్యాపారవేత్త రవిశంకర్‌కు కూడా అధిష్టానం ఫోన్ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఆమంచిని అధిష్టానంలోని నాయకులు తాడేపల్లికి పిలిపించుకున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డితో పాటు సీఎం ముఖ్యకార్యదర్శి ధనుంజయరెడ్డి కూడా ఆమంచితో మాట్లాడారు. ఆ తర్వాత సీఎం జగన్‌తో కూడా ఆయనకు భేటీ ఏర్పాటు చేశారు. పర్చూరు నుంచి పోటీ చేయాల్సిందేనని వారు సూటిగా చెప్పినట్లు తెలిసింది. వివిధ అంశాలపై చర్చల అనంతరం ఆమంచి జగన్‌ను కలవగా ఆయన కూడా అదే విషయాన్ని చెప్పినట్లు తెలిసింది. అయితే ఆమంచి అవునన్నారా, కాదన్నారా ఇతరత్రా ఏమైనా డిమాండ్లు పెట్టారా అనేది తెలియాల్సి ఉంది.

రుణ భారం ఉసురు తీసింది

- భర్త, పిల్లలకు టీలో ఎలుకల మందు కలిపి ఇచ్చిన తల్లి
- తాను కూడా ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ ఇద్దరు చిన్నారుల మృతి
- మాచర్ల మండలం నారాయణరెడ్డిపురంలో ఘటన



మాచర్ల, ఫిబ్రవరి 5: అప్పులు ఓ కుటుంబంలో చిచ్చుపెట్టాయి.. పొలం అమ్మి అప్పులు తీర్చుకుందామని భర్త చెప్పగా భార్య అందుకు అంగీకరించలేదు.. ఈ క్రమంలో దంపతులు తరచూ గొడవలు పడుతున్నారు.. కాగా ఆదివారం మధ్యాహ్న సమయంలో భర్త, పిల్లలకు టీలో ఎలుకల మందు కలిపి తాగించడమేగాక తాను కూడా తాగింది. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు.

వివరాల్లోకి వెళితే.. మండలంలోని నారాయణరెడ్డి పురానికి చెందిన రమావత్ రవినాయక్, తెలంగాణ రాష్ట్రం దామరచర్ల రాష్ట్రం నరసాపురానికి చెందిన వసంత భార్యాభర్తలు. వీరికి రమావత్ భానుప్రకాష్(12), కార్తీక్ ప్రకాష్, రెండున్నరేళ్ల కవలలు ఈశ్వర్, ఉమేశ్వర్‌లు సంతానం. వీరంతా నారాయణ రెడ్డిపురంలో ఉంటున్నారు. రవినాయక్ హైదరాబాద్‌లో ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ వారానికో వారం నారాయణ రెడ్డి పురం వస్తూ వెళ్తుంటాడు. అయితే అప్పులు పెరిగిపోవడంతో తమకున్న ఐదెకరాల పొలంలో రెండు ఎకరాలు అమ్మి అప్పులు తీర్చుదామని భార్యతో రవినాయక్ అన్నారు. ఇందుకు ఆమె అంగీకరించలేదు. దీంతో భార్యాభర్తలు కొద్ది రోజులుగా తర చూ గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో వసంత ఆది వారం మధ్యాహ్నం సమయంలో భర్తతోపాటు కుమారులు భానుప్రకాష్, ఈశ్వర్, ఉమేశ్వర్‌లకు టీలో ఎలుకల మందు కలిపి ఇచ్చింది. సాయంత్రానికి ముగ్గురు పిల్లలు వాంతులు చేసుకోవడంతో మాచర్ల పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పిల్లలతో కలిసి భార్యాభర్తలు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు. ఈలోగా భార్యాభర్తలకు కూడా వాంతులు అవుతుండడంతో రవికుమార్ తన భార్య వసంతను నిలదీశాడు. దీంతో వసంత జరిగిన విషయమంతా చెప్పింది. దీంతో ఆ ఐదుగురిని నరసరావుకుపేటకు వైద్యులు రిఫర్ చేశారు. మార్గ మధ్యంలో ఈశ్వర్ మరణించాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో భానుప్రకాష్‌ను నరసరావుపేట నుంచి నల్గొండకు రిఫర్ చేశారు. మార్గమధ్యంలో భానుప్రకాష్ కూడా మరణించాడు. కాగా భార్యాభర్తలు, ఉమేశ్వర్ నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ఏడేళ్ల కార్తీక్ ప్రకాష్ అమ్మమ్మ ఊరైన నరసాపురంలో ఉంటున్నాడు. దీనిపై విజయపురిసౌత్ ఎస్‌ఐ కొండారెడ్డి కేసు నమోదు చేశారు.

విశ్వకర్మయోజన పథకం ద్వారా
చేతి వృత్తిదారుల అభ్యున్నతికి కృషి

బాపట్ల,ఫిబ్రవరి 5 : విశ్వకర్మయోజన ద్వారా పేదలైన వారికి ఆర్థికచేయూతనందించాలని కలెక్టర్ వీ.రంజిత్‌బాషా తెలిపారు. విశ్వకర్మయోజనపై మునిసిపల్ కమిషనర్‌లతో సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చేతివృత్తిదారుల అభ్యున్నతికి, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం విశ్వకర్మయోజన పథకాన్ని అమలు చేస్తుందన్నారు. బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె పట్టణాలు నుంచి 422 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎంపికచేసిన 8 రంగాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి అర్హుల వివరాలను ప్రభుత్వానికి పంపాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీసీకార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కే.అర్జున్‌నాయక్, పరిశ్రమలశాఖ జీఎం రామకృష్ణ, కమిషనర్‌లు పాల్గొన్నారు.



విశ్వకర్మయోజనపై మున్సిపల్ కమిషనర్‌లతో సమీక్షిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

నిరుద్యోగులకు.. నిరాశే

- డిజిటల్ సంకల్పం.. అటకెక్కింది
- ఒక్క వైఎస్‌ఆర్ డిజిటల్ లైబ్రరీ పూర్తి కాలేదు...

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్లె సీమల్లో సాంకేతిక విప్లవం తీసుకురావాలని ప్రభుత్వం రెండేళ్ల కిందట నిర్ణయించింది. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించింది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు చేస్తున్న యవతకు వేగంగా పనిచేసే అపరిమిత ఇంటర్‌నెట్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని గొప్పగా ప్రకటించింది. ఇందుకు అవసరమైన భవనాల నిర్మాణం చేపట్టింది. వీటి నిర్మాణం అడుగు ముందుకు పడలేదు. నిధుల కొరతతో పనులు నిలిచిపో యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్క భవన నిర్మాణం పూర్తి కాలేదని సదరు శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వ నిధులు రూ 26.28 కోట్లతో 165 చోట్ల వైఎస్ఆర్ డిజిటల్ గ్రంథాలయ భవనాలు నిర్మించాలని నిర్ణయించారు.



పంచాయతీ రాజ్ శాఖకు నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. ఒక్కొక్క గ్రంథాలయం రూ 16 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయాలని అంచనాలను రూపొందించారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో భవనాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రతి కేంద్రానికి మూడు కంప్యూటర్లు, ప్రింటర్, స్కానింగ్, నిరంతరం ఇంటర్‌నెట్ సేవలు, ఇన్వర్టర్లు, అభ్యర్థులకు కావాల్సిన స్టడీ మెటీరియల్, దిన, వార పత్రికలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వ సంకల్పం అటకెక్కింది. కనీసం ఒక్క భవనం కూడా పూర్తికాలేదు. ఒక్క లక్ష రూపాయలు కూడా ఖర్చు చేయలేదు. నిర్మాణ పనుల్లో ఎలాంటి కదలిక లేదు. ఉమ్మడి గుం టూరు జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

పల్లె చెంతకు సాంకేతిక సేవలొస్తాయని ఆశించిన విద్యార్థులు, నిరుద్యోగ యువతకు నిరాశే మిగిలింది. డిజిటల్ గ్రంథాలయ భవనాల నిర్మాణం విషయంలో తొలుత హడావుడి చేసిన అధికార యంత్రాంగం నిధుల కొరతతో మిన్నకున్నది. ఉపాధి పథకం కింద కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించడంతోనే భవనాల నిర్మాణం నిలిచిపోయిందని చెప్పవచ్చు. ఇప్పట్లో ఈ పనులు చేపట్టే పరిస్థితి లేదని తెలుస్తోంది. మూడు దశల్లో 2023 జూన్ నాటికి నిర్మాణాలు పూర్త చేయాలని నిర్ణయించినా సాధ్యం కాలేదు.



బ్రెయిన్ ట్యూమర్స్

మెదడు, వెన్నుపాములో ట్యూమర్ల లక్షణాలు వ్యాధి నిర్ధారణను తప్పు దారి పట్టిస్తాయి. దాంతో మొదట్లోనే వాటిని కచ్చితంగా గుర్తించి, చికిత్స అందించడం ఆలస్యమవుతూ ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే ఈ ట్యూమర్ల లక్షణాల పట్ల లోతైన అవగాహన పెంచుకోవాలి.



మెదడు కణితులకు సమర్థమైన చికిత్సలు

వెన్నుపాములో ట్యూమరు వల్ల మూత్రవిసర్జన క్రమం తప్పవచ్చు. మెదడులో కణితుల వల్ల చేతులు, కాళ్లలో నిస్సత్తువ తగ్గవచ్చు. కానీ మనం ఈ లక్షణాలు తలెత్తే అవయవాల్లోనే సమస్య ఉందని భావిస్తాం. సదరు వైద్యులను సంప్రతిస్తూ ఉంటాం. కానీ నిజానికి మెదడు, వెన్నుపాము, ఇతరత్రా నాడీసంబంధ సమస్యలన్నీ ఇతరత్రా శారీరక వ్యవస్థలతో ముడిపడి ఉంటాయి. మెదడు సంబంధ ట్యూమర్లలో మెనింజియోమా, మెటాస్టాసిస్ అనే రెండు రకాల ట్యూమర్లు ప్రధానంగా కనిపిస్తూ ఉంటాయి. ఈ ట్యూమర్లను కేన్సర్ వైద్యులు చికిత్స చేయరు. ఎమ్మారైలో గడ్డ ఉందని కనిపెట్టినప్పుడు న్యూరాలజిస్టుల దగ్గరకే పంపిస్తూ ఉంటారు. అయితే మెదడు లేదా వెన్నుపాములో పెరిగే గడ్డలన్నీ కేన్సర్ గడ్డలే అయి ఉండవలసిన అవసరం లేదు. 12 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లల్లో లేదా 55 నుంచి 60 ఏళ్ల పెద్దల్లో బ్రెయిన్ ట్యూమర్లు తలెత్తవచ్చు. పిల్లల్లో పుట్టుకతోనే మెదడు కణాల్లో సమస్యల కారణంగా ట్యూమర్లు తలెత్తితే, పెద్దల్లో మెటాస్టాసిస్‌లు, మెనింజియోమాల తరహా ట్యూమర్లు తలెత్తుతూ ఉంటాయి. మెనింజియోమా బినైన్ ట్యూమరు. అప్పుడప్పుడూ తలనొప్పితో వేధించే ఈ ట్యూమర్లతో ప్రమాదం ఉండదు. అరుదుగా కొందర్లో 70 ఏళ్ల వయసుకు అవే ట్యూమర్లు పెరిగి ఫిట్స్ రావడం, మాట పడిపోవడం లాంటి లక్షణాలు కనిపించవచ్చు. అప్పుడు సర్జరీతో సమస్యను పూర్తిగా సరిదిద్దవచ్చు. ట్యూమర్లలో నాలుగు గ్రేడ్లు ఉంటాయి. మొదటి, రెండవ గ్రేడ్‌కు చెందిన ట్యూమర్లను సర్జరీతో తొలగిస్తే, సమస్య సమసిపోతుంది. కానీ మూడు లేదా నాల్గవ గ్రేడ్‌లో ఉన్న ట్యూమర్లు కేన్సర్ ట్యూమర్లు. సర్జరీ చేసినా ఇవి తిరగబెట్టే ప్రమాదం ఉంటుంది. కాబట్టి సర్జరీ తర్వాత రేడియేషన్, కీమోథెరపీలు అవసరమవుతాయి.

> మూడు లేదా నాల్గవ గ్రేడ్‌లో ఉన్న ట్యూమర్లు కేన్సర్ ట్యూమర్లు. సర్జరీ చేసినా ఇవి తిరగబెట్టే ప్రమాదం ఉంటుంది. కాబట్టి సర్జరీ తర్వాత రేడియేషన్, కీమోథెరపీలు అవసరమవుతాయి.

ఈ లక్షణాల పట్ల అప్రమత్తం

మెదడు ట్యూమర్ల ప్రధాన లక్షణం తలనొప్పి. దీంతో పాటు గడ్డ తలెత్తిన ప్రదేశాన్ని బట్టి లక్షణాలు మారుతూ ఉంటాయి. తలనొప్పి, ఫిట్స్, కాళ్లూ చేతులు మొద్దుబారడం, స్పర్శ కోల్పోవడం ప్రధాన లక్షణాలు. అలాగే...


- **మెదడులోని ఇన్సులార్ ప్రాంతం:** తలనొప్పి, కడుపులో తిప్పడం
- **మెదడు ముందు లేదా మధ్య ప్రాంతం:** జ్ఞాపకశక్తి తగ్గడం, ప్రవర్తనలో మార్పులు, చూపు మందగించడం
- **మెదడు వెనక భాగం:** రుచి, వాసన, స్పర్శలో సమస్యలు తలనొప్పితో పాటు ఇతరత్రా లక్షణాలు కూడా వేధిస్తూ ఉంటే ఆలస్యం చేయకుండా నాడీసంబంధ వైద్యులను కలవాలి.

ఈ పరీక్షలతో...

ఎమ్మారై స్కాన్‌తో నాడీసంబంధ ట్యూమర్లను కచ్చితంగా కనిపెట్టవచ్చు. ఈ స్కాన్‌లోనే యాంజియోగ్రామ్, వీనోగ్రామ్, కాంట్రాస్ట్ స్టడీలను చేపట్టి, ట్యూమర్‌ను కచ్చితంగా అంచనా వేసి, చికిత్సను నిర్థారించడం జరుగుతుంది.

చికిత్స ఇలా...

క్లిష్టమైన ప్రాంతంలో లేని, రెండు సెంటీమీటర్ల కంటే చిన్న గడ్డలకు సర్జరీ అవసరం ఉండదు. ఫాలోఅప్‌లో గమనించుకుంటూ పెరుగుతుందనుకున్నప్పుడు రేడియేషన్‌తో చికిత్స చేయవచ్చు. క్లిష్టమైన ప్రాంతంలో ఉన్న గడ్డలకు రేడియేషన్‌తో హాని ఎక్కువ కాబట్టి వాటిని సర్జరీ చేసి తొలగించవలసి వస్తుంది. సర్జరీ తర్వాత గడ్డను అనాలసిస్ చేసి, గ్రేడ్‌ను బట్టి రేడియేషన్ లేదా కీమోథెరపీని వైద్యులు సూచిస్తారు. మొదటి రెండు దశల ట్యూమర్లకు, ప్రతి మూడు, ఆరు, 12 నెలలకోసారి ఎమ్మారై చేసుకుంటూ గడ్డను గమనిస్తూ ఉండాలి. పెరుగుతూ ఉంటే సర్జరీ చేయక తప్పదు. మూడు, నాలుగు దశల్లోని ట్యూమర్లను సర్జరీతో తొలగించిన తర్వాత, రేడియేషన్ కూడా అవసరమవుతుంది. తర్వాత కూడా వైద్యులను తరచూ కలుస్తూ ఉండాలి.



> మెదడు సర్జరీపరంగా అత్యాధునిక సాంకేతికతలు అందుబాటులోకొచ్చాయి. వీటితో 80 నుంచి 90% మేరకు విజయవంతమైన ఫలితాలను రాబట్టుకోవచ్చు. ప్రస్తుతం మైక్రోస్కోపిక్ సర్జరీలో భాగంగా ఇమ్యునోఫ్లోరసెంట్ విధానాన్ని అనుసరిస్తూ, రక్తనాళం ద్వారా రంగు పదార్థాన్ని మెదడులోకి పంపించి, ట్యూమర్‌ను స్పష్టంగా చూడగలిగే చికిత్సలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. న్యూరో మానిటరింగ్ ద్వారా క్లిష్టమైన ప్రదేశాల్లోని గడ్డలను కూడా జాగ్రత్తగా తొలగించే వీలుంది. అలాగే చిన్న ట్యూమర్లను తొలగించే క్యూసా మిషన్లు కూడా ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి ఇలాంటి ఆధునిక చికిత్సలతో మెదడులోని ఇతర ప్రాంతాలు దెబ్బతినకుండా ట్యూమర్‌ను సమర్థంగా తొలగించడం వల్ల మరింత మెరుగైన ఫలితాలను సాధించవచ్చు.

డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి
కన్సల్టెంట్ న్యూరో అండ్ స్పైన్ సర్జన్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



మీకు తెలుసా?



బ్రేక్‌ఫాస్ట్ మానేయడం మంచిదే!

రోజు మొత్తంలో అత్యంత ముఖ్యమైన భోజనం, బ్రేక్‌ఫాస్ట్ అని మనం చిన్నప్పటి నుంచీ వింటూ ఉన్నాం. కానీ బ్రేక్‌ఫాస్ట్‌ను స్కిప్ చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని తాజా అధ్యయనాలు చెప్తున్నాయి.

రాత్రి భోజనం తినడానికీ ఉదయం నిద్ర లేవడానికీ మధ్య ఉండే విరామ సమయంలో మన శరీరం రాత్రి తిన్న భోజనం ద్వారా అందిన క్యాలరీలను ఖర్చు చేసుకుంటుంది. అయితే అదే విరామ సమయాన్ని మరికొంత పొడిగిస్తే, ఖర్చు చేయడానికి సరిపడా క్యాలరీలు లేక మన శరీరం కొవ్వును కరిగించుకోవడం మొదలు పెడుతుంది. అయితే ఆ విరామ సమయంలో ఆకలితో కలిగే పదార్థ వ్యామోహాలు, ఎమోషనల్ ఈటింగ్‌లకు చెక్ పెడుతూ ఉండాలి. దీర్ఘ సమయాల పాటు శరీరానికి ఆహారం అందించకపోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఇవే!

- **వ్యాధుల నుంచి రక్ష:** టైప్2 మధుమేహం, గుండె జబ్బులు, వయసుతో సంబంధం ఉన్న న్యూరోడీజెనరేటివ్ డిజార్డర్లు, ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్, పలు రకాల కేన్సర్ల నుంచి రక్షణ పొందవచ్చు. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌తో అధిక రక్తపోటు అదుపులోకొస్తుంది. విరామ సమయంలో గుండె కొట్టుకునే వేగం తగ్గుతుంది.
- **బరువు తగ్గొచ్చు:** మెటబాలిజంను పెంచడం ద్వారా బరువు తగ్గడం మీ లక్ష్యమైతే, దీనికీ ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తినకపోడానికీ ఎటువంటి సంబంధం ఉండదు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో మెటబాలిజం కిక్‌స్టార్ట్ అవుతుందనేది అపోహ మాత్రమే!
- **శక్తి పెరుగుతుంది:** బ్రేక్‌ఫాస్ట్‌తో అందే క్యాలరీల మీద కోత విధిస్తే, నీరసం బదులుగా శక్తి సమకూరుతుంది. ఇందుకు కారణం శరీరం సురక్షితమైన కీటోజెనిక్ స్థితిలోకి ప్రవేశించడమే!
- **ఆటోఫజీ:** కణాల వ్యర్థాలను శుభ్రం చేసే ప్రక్రియ ఆటోఫజీ. ఈ ప్రక్రియ జరగనప్పుడు పైబడే వయసుతో ముడిపడి ఉండే ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి. ఆహారం తీసుకోనప్పుడు, ఆటోఫజీ వల్ల కణ శుభ్రత పెరుగుతుంది.
- **అప్రమత్తత:** ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మానేయడం వల్ల మానసిక అప్రమత్తత, ఏకాగ్రతలు పెరుగుతాయి.
- **ఇన్సులిన్ సెన్సిటివిటీ:** ఫాస్టింగ్ గ్లూకోజ్, ఫాస్టింగ్ ఇన్సులిన్, లెప్టిన్‌లు తగ్గి ఫలితంగా ఇన్సులిన్ రెసిస్టెన్స్ కూడా తగ్గుతుంది.
- **ఇన్‌ఫ్లమేషన్:** మధుమేహం, మల్టిపుల్ స్క్లెరోసిస్, ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ సిండ్రోమ్‌లతో ముడిపడి ఉండే ఇన్‌ఫ్లమేషన్ ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌తో తగ్గుతుంది.

ఈ వ్యాయామంతో గుండె పదిలం

ఫిట్‌నెస్



గుండె వేగం పెంచే వ్యాయామాలతోపాటు గుండెకు విశ్రాంతినిచ్చే వ్యాయామాలు చేయడమూ అవసరమే! నిత్యం శరీరమంతా రక్తాన్ని పంప్ చేస్తూ అలసిపోయే గుండెకు నిద్రలో తప్ప విశ్రాంతి దొరకదు. ఆ భంగిమలో కూడా గుండె మీద అంతో కొంత ఒత్తిడి ఉంటూనే ఉంటుంది. అయితే రక్తప్రసార వేగాన్ని తగ్గించి గుండెకు సాధ్యమైనంత ఎక్కువ విశ్రాంతినిచ్చే భంగిమలూ ఉన్నాయి. వాటితో గుండెకు ఉపశమనం కలుగుతుంది. కాబట్టి ఇదిగో ఈ వ్యాయామం కోసం రోజు మొత్తంలో కనీసం ఐదు నిమిషాలు కేటాయించండి. ఈ వ్యాయామం ఎలా చేయాలంటే?

- గోడకు దగ్గరగా మ్యాట్ వేసుకుని వెల్లకిలా పడుకోవాలి.
- ఇలా పడుకున్నప్పుడు మోకాళ్లను మడిచి, పైకి లేపి, పిరుదులు గోడకు తగిలేలా దగ్గరగా జరగాలి.
- చేతులను వెనక్కి వాల్చేసి, కాళ్లను నెమ్మదిగా నిటారుగా పైకి లేపాలి.
- పైకి లేపిన కాళ్లను గోడకు ఆనించి, బరువును గోడ మీదే వేయాలి.
- ఈ భంగిమలో ఉన్నప్పుడు మనసు ప్రశాంతంగా ఉంచుకుని, ఊపిరి పీల్చుకోవాలి.
- ఆ సమయంలో గుండె వేగం తగ్గడం స్పష్టంగా తెలుస్తుంది.
- ఇలా 5 నిమిషాలపాటు ఉండి నెమ్మదిగా కాళ్లను కిందకి దించి, చేతులు నేల మీద ఉంచి, లేచి నిలబడాలి.

ఆయుర్వేదం

అశ్వగంధతో ఆరోగ్యం

అశ్వగంధ వేరు చూర్ణంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దక్కుతాయి. అవేంటంటే...

- **ఒత్తిడి, ఆందోళన దూరం:** ఈ చూర్ణం పాలతో కలిపి తీసుకుంటే ఒత్తిడి తగ్గి చక్కటి నిద్ర పడుతుంది. అంతేకాదు. ఒత్తిడి, ఆందోళనల ప్రభావం మూలంగా తలెత్తే ఆరోగ్య ఇబ్బందులను అధిగమించే శక్తిని సమకూరుస్తుంది.
- **బరువు తగ్గిస్తుంది:** ఇతర బరువు తగ్గించే మందులతో కలిపి ఈ చూర్ణాన్ని వాడితే ప్రభావం ఎక్కువగా ఉంటుంది. స్ట్రెస్ మూలంగా హెచ్చుతగ్గులకు గురయ్యే మెటబాలిజంను సరిచేసే శక్తి ఈ చూర్ణానికి ఉంటుంది. కాబట్టి బరువు తగ్గే వేగం పెరుగుతుంది.



- **మధుమేహం అదుపు:** నోటి మాత్రలకంటే ప్రభావవంతంగా ఈ చూర్ణం రక్తంలోని గ్లూకోజ్ లెవెల్స్‌ను తగిస్తుంది. రక్తంలోని గ్లూకోజ్ లెవెల్స్‌ను సమం చేసి ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది.
- **కేన్సర్ నుంచి రక్షణ:** పెద్దపేగు, రొమ్ములు, ఊపిరితిత్తుల కేన్సర్‌ల నుంచి రక్షణ కల్పిస్తుంది.
- **బొల్లి:** అశ్వగంధ చూర్ణానికి బొల్లి మచ్చలు చక్కగా స్పందిస్తాయి. కెరటోసిస్ అనే చర్మ చికిత్సకు అశ్వగంధ చూర్ణంతో తయారుచేసిన పేస్ట్ వాడతారు. అశ్వగంధ అద్భుతమైన స్కిన్ టోనర్‌గా కూడా పని చేస్తుంది.

వెజైనల్ హెల్త్‌ను పరిరక్షించుకోవడమనేది మహిళల పూర్తి ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. వెజైనా సమస్యలు మహిళలను మానసికంగా శారీరకంగా కుంగదీయడమే కాకుండా, వైవాహిక జీవితంలో ఒత్తిడి, ఆందోళనలకూ లోను చేస్తాయి. కాబట్టి వెజైనల్ హెల్త్ గురించి ప్రతి మహిళా అవగాహన ఏర్పరుచుకోవడం అవసరం.

ఆ ఇబ్బందులు తొలగాలంటే...

విమెన్స్ హెల్త్

వెజైనాకు సంబంధించి స్వల్ప సమస్యలు మొదలు తీవ్రమైన సమస్యల వరకూ ఉంటాయి.

వెజినైటిస్

వెజైనా ఇన్‌ఫ్లమేషన్‌కు గురి కావడమే వెజినైటిస్. సాధారణంగా వెజైనాలో బ్యాక్టీరియా, ఈస్ట్‌ల మధ్య ఆరోగ్యకరమైన సంతులనం ఉంటుంది. ఈ సహజసిద్ధ సంతులనం దెబ్బతిన్నప్పుడు, మహిళలు అసౌకర్యాన్ని ఎదుర్కొంటారు. అలాగే అసాధారణమైన వాసన కూడా మొదలవుతుంది. ఈస్ట్ ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా వెజినైటిస్ రావచ్చు. లేదా కొత్త రకాల సబ్బులు, పలు రకాల ఫ్యాబ్రిక్స్‌తో తయారైన లోదుస్తుల వాడకం వల్ల కూడా ఈ సమస్య తలెత్తవచ్చు. నెలసరి తర్వాత కొందర్లో అట్రోపిక్ వెజినైటిస్ వస్తూ ఉంటుంది. ఈ సమస్యలో వెజైనా పొడిబారడం, ఇన్‌ఫ్లమేషన్‌లు ఉంటాయి.

బ్యాక్టీరియల్ వెజినోసిస్

వెజైనాలో బ్యాక్టీరియా గ్రోత్ పెరిగిపోయినప్పుడు ఈ సమస్య తలెత్తుతుంది. దురద, అసౌకర్యం, దుర్వాసన ఈ సమస్య ప్రధాన లక్షణాలు. ఈ సమస్య లైంగిక వ్యాధులు, హెచ్‌ఐవి సోకే ముప్పును కూడా పెంచుతుంది.

ట్రైకోమోనియాసిస్

ఇదొక లైంగిక వ్యాధి. పరాన్నజీవుల ద్వారా సంక్రమిస్తుంది. వెజైనా ఎర్రబారడం, దురద, మూత్రవిసర్జన సమయంలో అసౌకర్యం, యోని నుంచి స్రావం, దుర్వాసనలు ఉంటాయి.

వల్వోడైనియా

యోని ప్రవేశద్వారం దగ్గర నొప్పి ఈ సమస్య ప్రధాన లక్షణం. మంట, గుచ్చినట్టు అనిపించడం, కందిపోవడం, వాపు లాంటి లక్షణాలు కూడా ఉంటాయి. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే, లైంగిక కలయిక ఇబ్బందిగా మారి అనవసరపు సమస్యలకు దారి తీస్తుంది.

ఎస్‌టిఐ

లైంగిక వ్యాధులన్నీ యోని ఆరోగ్యాన్ని దెబ్బ తీసేవే! క్లమీడియా, గొనొరియా, జెనైటల్ హెర్పిస్ ప్రధాన లైంగిక వ్యాధులు. జెనైటల్ హెర్పిస్‌లో యోని నుంచి స్రావం, రక్తస్రావం, నొప్పి ఉంటాయి.

పొడిబారడం

యోని పొడిబారడానికి పలు కారణాలుంటాయి. ఈస్ట్రోజన్ హార్మోన్ లోపం, ఒత్తిడి ప్రధాన కారణాలు. అయితే శారీరకంగా కలిసే సమయంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఇబ్బంది పెడుతూ ఉంటుంది.

యోని ఆరోగ్యం కోసం...

- యోని ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. నీళ్లు, ఘాటైన వాసనలు వెదజల్లని సబ్బును ఉపయోగించి శుభ్రం చేసుకోవాలి.
- శరీరానికి సౌకర్యంగా ఉండే లోదుస్తులు, శానిటరీ న్యాప్కిన్స్ ఎంచుకోవాలి. ధరించే ప్యాంటీ తడిని పీల్చేదై ఉండాలి. రాత్రివేళ ప్యాంటీ ధరించకపోవడమే మేలు. నెలసరి సమయంలో సెంటెడ్ ట్యాంపూన్లు, ప్యాడ్స్, లైనర్స్ వాడకూడదు.
- బిగుతైన దుస్తులు ధరించకూడదు. బిగుతుగా ఉండే జీన్స్, షేప్‌వేర్‌లను ఎక్కువ సమయం పాటు ధరించడం వల్ల వెజైనల్ ఇన్‌ఫెక్షన్స్ పెరుగుతాయి.
- తడిచిన స్విమ్‌వేర్, అండర్‌ప్యాంట్స్ ఎక్కువ సమయం పాటు ధరించి ఉండిపోకూడదు. ఇలా చేస్తే ఈస్ట్ ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలు పెరుగుతాయి.
- వాష్‌రూమ్‌ను ఉపయోగించిన ప్రతిసారీ వెజైనల్ ఏరియాను పొడిగా తుడుచుకోవాలి. వాష్‌రూమ్ ఉపయోగించిన తర్వాత యోని, మూత్రనాళం, పురీష నాళాల్లో సూక్ష్మజీవులు, ఈస్ట్ పెరిగిపోకుండా ఉండాలంటే యోనిని ముందు నుంచి వెనకకు శుభ్రం చేసుకోవాలి.

చికిత్సలు ఉన్నాయి



తక్కువ పొటెన్సీని కలిగి ఉండే పైపూత స్టిరాయిడ్లు, నోటి ద్వారా వాడుకునే యాంటీబయాటిక్స్, యాంటీ ఫంగల్స్, యాంటీబ్యాక్టీరియల్ లోషన్లు ఉంటాయి. యోని సమస్యలకు సాధారణంగా వైద్యులు క్లోట్రిమజోల్, బ్యూటోకోనజోల్ మందులనే సూచిస్తూ ఉంటారు. క్లిండామైసిన్ లేదా మెట్రోనిడజోల్‌లను బ్యాక్టీరియల్ వెజినైటిస్‌కూ సూచిస్తూ ఉంటారు. అయితే సమస్యను కచ్చితంగా కనిపెట్టి, ప్రభావవంతమైన మందులను వైద్యులే సూచించగలుగుతారు కాబట్టి యోనిలో ఎటువంటి సమస్య తలెత్తినా ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి.



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

మూడు ముక్కల ఆటతో ఏపీ నాశనం

● 1511వ రోజుకు అమరావతి రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 5: అమరావతిని నిర్వీర్యం చే సినందుకు అన్నదాత ఉసురు తగలక మానదని 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల సందర్భంగానైనా అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1511వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ రాష్ట్రానికి సంపదనిచ్చే రాజధాని అమరావతిని విస్మరించి మూడు రాజధానులంటూ సీఎం జగన్‌రెడ్డి భ్రష్టు పట్టించారన్నారు. పక్క రాష్ట్రాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే వైసీపీ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ మాత్రం అట్టడుగుకు వెళ్ళిందన్నారు. ఇటువంటి గడ్డు పరిస్థితిలో విజన్ ఉన్న చంద్రబాబు నాయుడు సీఎం కావాలన్నారు. లేదంటే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పూర్తిగా వెనకబడిపోతుందన్నారు. మూడు ముక్కల ఆటతో ఏపీని నాశనం చేయవద్దన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

సీఎం వెళ్తున్నప్పుడు జై అమరావతి నినాదాలు..

సీఎం జగన్‌రెడ్డి వెలగపూడి అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్నప్పుడు బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ మందడం రైతు ధర్నా శిబిరంలో రైతులు, రైతు కూలీలు, మహిళలు నినాదాలు చేశారు. పోలీసులు ధర్నా శిబిరం ముందు భారీ సంఖ్యలో మోహరించారు.



బిల్డ్ అమరావతి అంటూ సీఎం వచ్చే సమయంలో మందడంలో నినాదాలు చేస్తున్న రైతులు, మహిళలు

అందరం కలిసి అభివృద్ధికి కృషి చేద్దాం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు
● మక్కెనను మర్యాదపూర్వకంగా కలిసిన జీవీ
● శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానం

వినుకొండ, ఫిబ్రవరి 5: వినుకొండలో అరాచక పాలన సాగిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును సాగనంపి అందరం కలిసి వినుకొండ అభివృద్ధికి పాటుపడదామని మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. వైసీపీకి రాజీనామా ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావును సోమవారం ఆయన కార్యాలయంలో జీవీ ఆంజనేయులు కలిసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ మక్కెన మల్లికార్జునరావు ఎమ్మెల్యేగా మంచి అనుభవం ఉందని, కాంగ్రెస్, వైసీపీల్లో పనిచేశారని, ఆయన అనుభవం వినుకొండ అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీ, జనసేన పార్టీలు కలిసి ముందుకు వెళ్తున్నాయని, రాష్ట్రం ఈ ఐదేళ్లల్లో 30 ఏళ్ల వెనక్కి వెళ్లిందని, మళ్లీ రాష్ట్ర, యువత భవిష్యత్ బాగుపడాలంటే చంద్రబాబునాయుడు సీఎం కావాలని అన్నారు. మక్కెన మల్లికార్జున రావు మాట్లాడుతూ గతంలో పనిచేసిన ఎమ్మెల్యేలు పాలక పక్షంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వారి గౌరవాలకు ఇబ్బంది కలగకుండా ప్రజాసమస్యలపై పోరాడుతున్న సమయంలో ప్రతిపక్షాలు వారిని గౌరవించడం జరిగిందన్నారు. ప్రస్తుతం వినుకొండలో అలాంటి పరిస్థితులు లేవని, ప్రతిపక్షపార్టీ ప్రజాసమస్యలపై పోరాడుతున్న సమయంలో రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తున్నారని బొల్లాను ఉద్దేశించి అన్నారు. దీనికి సాక్ష్యం గతంలో బస్టాండ్ వద్ద జరిగిన ఘటనే అని అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులను ఇనుపరాడ్లతో తలలు పగలగొట్టడం, పోలీసుల కాల్పుల వరకు వెళ్లడం, దాన్ని సమర్థిస్తూ దాడి చేసినవారిని కాపాడుకుంటూ పోవడం దాడులను ప్రోత్సహించడం కాదా అని ప్రశ్నించారు. ఇలాంటి నాయకులకు అండగా ఉండలేకే వైసీపీని వీడానని తెలిపారు. తనకు జనసేన, కాంగ్రెస్ పార్టీల నుంచి కూడా ఆహ్వానాలు వచ్చాయని, అయితే వినుకొండ అభివృద్ధికి తోడ్పడే వారితో కలిసి వెళ్తానని మక్కెన అన్నారు. వినుకొండ నియోజకవర్గానికి అభివృద్ధి చేసినవారిలో నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కూడా ఉన్నారని, ఆయనను, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని, వినుకొండలో ఉన్న తన అనుచరులతో మాట్లాడి సానుకూలమైన ప్రకటన చేస్తానని తనకు కొంత సమయం కావాలని మక్కెన.. జీవీని కోరారు. అనంతరం జీవీ స్పందిస్తూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఎన్నో మంచిపనులు వినుకొండకు చేశారని, మక్కెన మల్లికార్జునరావుకు టీడీపీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. మక్కెనను కలిసిన వారిలో లగడపాటి వెంకట్రావు, నక్కా వీరారెడ్డి, అమృతపూడి కోటయ్య, వి.వి.సురేష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



మక్కెనతో సంభాషిస్తున్న జీవీ ఆంజనేయులు

పునరావాస కేంద్రాల్లో ఉచితంగానే రిజిస్ట్రేషన్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 5: పులిచింతల ప్రాజెక్టు పరిధిలోని పునరావాస కేంద్రాల్లో స్థలాలు, ఇల్లు రిజిస్ట్రేషన్ పేరుకే ఉచితం.. మామూళ్ల ఇష్టారాజ్యం అంటూ సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో పాటు పులిచింతల ప్రాజెక్టు అధికారులు కూడా స్పందించారు. పులిచింతల పునరావాస కేంద్రాల్లో స్థలాలు, ఇల్లు రిజిస్ట్రేషన్‌కు ఫీజు, యూజర్ చార్జి లేకుండానే రిజిస్ట్రేషన్ జరపాల్సి వుందని, ఇందుకోసం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఒక్క రూపాయి కూడా నగదు ఇవ్వాల్సిన అవసరం లేదని పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ కందుల శ్రీరాములు, సబ్‌రిజిస్ట్రార్ తీర్థరాజ్యలక్ష్మి తెలిపారు. ఉచిత రిజిస్ట్రేషన్‌ల కొరకు నేరుగా కార్యాలయ అధికారులనే సంప్రదించవచ్చునని, బయటి వ్యక్తులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దన్నారు.

8న పిడుగురాళ్లలో జంగా ఆత్మీయ సమావేశం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 5: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి రాజకీయ కార్యాచరణ కొరకు ఈ నెల 8వ తేదీన పిడుగురాళ్లలో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు బడుగు బలహీనవర్గాల ఐక్యవేదిక కార్యదర్శి షరీఫ్ తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జంగా అనుచరులు, బలహీనవర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాల నేతలతో సమావేశమై రాజకీయంగా ఓ నిర్ణయానికి వచ్చేలా జంగా సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకోనుంది.

టెక్స్‌టైల్ టెక్నాలజీ విద్యార్థులకు ఉపకార వేతనాలు



సామినేని కోటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 15 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సామినేని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాక అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హత కల్గిన విద్యార్థులు ఫిబ్రవరి 12వ తేదీలోపు తమ వివరాలను ఐఎన్‌ఎఫ్‌వో ఎట్‌దిరేట్ ఎస్‌ఏఎల్‌వైఏఎం. కామ్ లేదా హెచ్‌ఆర్ ఎట్‌దిరేట్ ఎస్‌ఏఎల్‌వైఏఎం.కామ్ అనే మెయిల్ ఐడిలకు పంపాలని కోరారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 15వ తేదీన పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు సమీపంలోని బోయపాలెం అనంతలక్ష్మీ స్పిన్నింగ్ మిల్ ఆవరణలో ఒక్కొక్కరికి రూ. 15 వేలు అందజేయనున్నట్టు వివరించారు.

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య



చీమల అంకిరెడ్డి(ఫైల్)

రొంపిచర్ల, ఫిబ్రవరి 5 : పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చీమల అంకిరెడ్డి(75) నాలుగు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. వరి, మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. తెగుళ్లు, అకాల వర్షంతో దిగుబడులు సరిగ్గా రాలేదు. దాంతో సుమారు ఐదు లక్షల మేర అప్పులు అయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో పొలంలోనే బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు పేర్కొన్నారు. భార్య, ముగ్గురు సంతానం కాగా కుమారులకు, కుమార్తెలకు వివాహాలు జరిగాయి. కుమారుడు వెంకటేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పాల్ రాజు రవీంద్ర తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఏసీబీ వలలో సొసైటీ సెక్రటరీ



ఏసీబీకి పట్టుబడిన ప్రభాకరరావు

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి4: మండలంలోని ముట్లూరు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ కార్యాలయంపై సోమవారం ఏసీబీ అధికారుల దాడి చేశారు. రుణం మంజూరు కోసం సొసైటీ సెక్రటరీ ప్రభాకరరావు లంచం తీసుకుంటుండగా పట్టుకొన్నారు. వివరాల్లోకి వెళితే... ముట్లూరు గ్రామానికి చెందిన గ్రామ ఉపసర్పంచ్ ఎనుముల బాలస్వామి తల్లి పొలం తాకట్టుపెట్టి రుణం పొందేందుకు సొసైటీలో దరఖాస్తు చేసుకొంది. దరఖాస్తును పరిశీలించి రూ.16లక్షల రుణం మంజూరు చేస్తామని అందుకు ఖర్చుల కింద రూ.40వేలు ఇవ్వాలని అడిగారని బాలస్వామి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు.

మా ఆందోళనకు మద్దతు ఇవ్వండి

● పీసీసీకి వరికపూడిశెల ప్రాజెక్టు రైతుల వినతి

విజయవాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వరికపూడిశెల ప్రాజెక్టు సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే ఆందోళనకు మద్దతు ఇవ్వాలని సమితి ప్రతినిధులు పీసీసీ నేతలను కోరారు. వారు విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీకి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ ప్రాజెక్టు పనులను సీఎం జగన్ గడచిన ఏడాది నవంబరు 15న మాచర్లలో వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. ఇప్పటి వరకు రూపాయి నిధులు విడుదల చేయలేదన్నారు. ఈ ప్రాజెక్టు సాధన కోసం జరిగే ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

పీఎఫ్ వడ్డీ నష్టపోతున్న ఉద్యోగులు

● పీఆర్‌టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.శ్యామ్ మోజెస్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి5: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పంచాయతీరాజ్, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2022 అక్టోబరు నుంచి జీతాల బిల్లుల నుంచి మినహాయించిన నగదు జడ్పీ పీఎఫ్ ఖాతాల్లో జమకాలేదని పీఆర్‌టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.శ్యామ్ మోజెస్ సోమవారం తెలిపారు. 14 నెలల నుంచి ఏకమొత్తంగా జమ అయిన సొమ్ము నెల వారి జమచేయకుండా మొత్తం డిసెంబరు 2023లో జమ అయినట్లు చూపెడుతుందన్నారు. సొమ్ము జమ అయిన తేదీని వడ్డీకి పరిగణనగా తీసుకోవటం దారుణం అన్నారు. ఇలా అయితే వేలాది రూపాయల వడ్డీ నష్టపోతున్నారని తెలిపారు. నష్ట నివారణకు తగిన చర్యలు వెంటనే చేట్టాలని డిమాండ్ చేశారు. నరసరావుపేట మున్సిపాలిటీలో 5 గ్రామాలు విలీనం జరగటం వలన కోటప్పకొండ, జీముప్పాళ్ళ, గోనెపూడి, పమిడిపాడు, పరగటిచర్ల గ్రామాల ఉద్యోగులకు 10 శాతం నుంచి 16శాతం పెంపుదలతో నరసరావుపేట పట్టణానికి వర్తించే హెచ్‌ఆర్‌ఏ చెల్లిస్తారని పీఆర్‌టీయు ప్రధాన కార్యదర్శి ఎ.వెంకటేశ్వరరావు అన్నారు.

రాజధానిలో నారా భువనేశ్వరి ఓదార్పు పర్యటన

తుళ్లూరు, ఫిబ్రవరి 5: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడి సతీమణి నారా భువనేశ్వరి ఈ నెల 8వ తేదీన గురువారం రాజధాని అమరావతి ప్రాంతంలో ఓదార్పు యాత్ర చేయనున్నట్టు టీడీపీ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆమె ఓదార్చేందుకు వస్తున్నట్టు తెలిపారు. ఉదయం పది టంగలకు ఉండవల్లి నివాసం నుంచి భువనేశ్వరి బయలు దేరతారు. మధ్యాహ్నం 12 గంటలకు ఫిరంగిపురం మండలం రేగులగడ్డ(కండ్రిక)గ్రామం. మధ్యాహ్నం ఒంటి గంటకు తాడికొండ మండలం బండారు పల్లి గ్రామం, 3 గంటలకు తుళ్లూరు, 3.30 గంటలకు రాయపూడి. సాయంత్రం 4 గంటలకు వెంకటపాలెంలో పర్యటిస్తారు. అనంతరం వెంకటపాలెంలోనే మహిళా పాడి రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని టీడీపీ వర్గాలు పేర్కొన్నాయి.

నేడు నియోజకవర్గంలో నిజం గెలవాలి పర్యటన..

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 5: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు సమయంలో మనస్తాపంతో మృతిచెందిన కుటుంబాలను పరామర్శించేందుకు నారా భువనేశ్వరి రాష్ట్ర వ్యాపితంగా చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమం మంగళవారం మంగళగిరి నియోజకవర్గంలో జరుగనుందని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు దుగ్గిరాల గ్రామంలో కన్నెగంటి నాగేశ్వరరావు కుటుంబసభ్యులను, 12:45 గంటలకు శృంగారపురం గ్రామంలో శృంగారపాటి శౌరీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తారని చెప్పారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు చినకాకానిలో అనుమోలు బసవరాజు కుటుంబ సభ్యులను, 2:40 గంటలకు తాడేపల్లి పట్టణం బ్రహ్మానందపురంలో దారా వెంకటయ్య కుటుంబ సభ్యులను, 3:05 గంటలకు నవులూరు గ్రామంలో వేమూరి కోటయ్య కుటుంబ సభ్యులను, 3:30 గంటలకు ఎర్రబాలెం గ్రామంలో జొన్నాదుల కోటేశ్వరరావు కుటుంబాన్ని, 4 గంటలకు కృష్ణాయపాలెంలో ఈపూరి దేవశ్యామ్ కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శిస్తారని తెలియజేశారు.

బీజేపీ నేతల కనుసన్నల్లో అయోధ్య రైలు

● 7వ తేదీన గుంటూరు రైల్వేస్టేషన్ నుంచి కూత
● గంపగుత్తగా నగదుని ఐఆర్‌సీటీసీకి డిపాజిట్

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అయోధ్యదాంకి(రౌండ్ ది ట్రిప్) రైలు మొత్తం బీజేపీ నేతల కనుసన్నల్లో ప్రయాణించనుంది. ఈ రైలుని ప్రత్యేక రైలుగా కాకుండా ఐఆర్‌సీటీసీ రైలుగా నడపనుండటమే ఇందుకు కారణం. గత నెల 31వ తేదీనే గుంటూరు నుంచి బయలుదేరాల్సిన అయోధ్యదాం రైలు వాయిదా పడగా ప్రస్తుతం ఈ నెల 7వ తేదీని ఖరారు చేశారు. బుధవారం మధ్యాహ్నం గుంటూరు రైల్వేస్టేషన్‌లో బీజేపీ నేతలు సత్యకుమార్, ఇతర నాయకులు జెండా ఊపి ఈ రైలుని ప్రారంభించనున్నారు. టిక్కెట్‌లు, క్యాటరింగ్ ఛార్జీలు కలిపి మొత్తం నగదుని గంపగుత్తగా బీజేపీ నేతలే ఐఆర్‌సీటీసీకి చెల్లించారు. తొలుత వారి నాయకులు, కార్యకర్తలకే ఈ రైలులో ప్రయాణించే అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఆశించినంతంగా బీజేపీ కార్యకర్తల నుంచి స్పందన రాకపోవడంతో సామాన్య ప్రజలకు ఓపెన్ చేశారు. దాంతో దాదాపుగా 1,350 టిక్కెట్ల వరకు బుకింగ్ అయిపోయాయి. టిక్కెట్, ఐదు రోజులకు క్యాటరింగ్ ఛార్జీలు కలిపి కేవలం రూ.2,300 మాత్రమే చెల్లించినట్లు యాత్రికులు తెలిపారు.

చలో అసెంబ్లీకి అనుమతి లేదంటూ టీడీపీ నేతల అరెస్టు

వేమూరు, కొల్లూరు, ఫిబ్రవరి 5: ఎలాంటి కారణం లేకుండా వేమూరు పోలీసులు ఆదివారం అర్ధరాత్రి 12గంటల సమయంలో మండలంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన ఐదుగురు నాయకులను అక్రమంగా అరెస్టు చేశారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దొప్పలపూడి సుధాకర్, పోలు ప్రసాద్, తెలుగు యువత నాయకులు కోగంటి రాజేష్, గోపినాథ్‌లకు ఫోన్లు చేసి స్టేషన్‌కు పిలిపించారు. చలో అసెంబ్లీకి అనుమతి లేదంటూ వారి నుంచి పోలీసులు ఎలాంటి సంతకాలు తీసుకోకుండా కేవలం ఫొటోలు తీసుకుని తరువాత వారిని విడుదల చేశారు.

అదేవిధంగా ఆదివారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు కొల్లూరు మండలంలో పలువురి ఇళ్ళకు వచ్చి అసెంబ్లీ ముట్టడికి వెళ్ళకూడదంటూ నోటీసులు జారీ చేశారన్నారు. అసెంబ్లీ ముట్టడి ఏమిటని ప్రశ్నించగా ఉదయాన్నే స్టేషన్‌కు హాజరు కావాలంటూ చెప్పి వెళ్ళారు. మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ ఇంటికి తెల్లవారు జామున వెళ్ళి నోటీసులు అందించడంతో పాటు హౌస్‌అరెస్టులో ఉండాలంటూ చెప్పారు. అసలు అసెంబ్లీ ముట్టడి తమ పార్టీ నాయకులు ఎవ్వరూ పిలుపు ఇవ్వలేదని పోలీసులే అత్యుత్సాహంతో అర్ధరాత్రి నిద్రలేపి మరీ నోటీసులు ఇవ్వడంతో పాటుగా స్టేషన్‌కు రావాలంటూ తమను ఇబ్బందులకు గురి చేశారని పార్టీ నాయకులు వాపోతున్నారు.



వేమూరు పోలీస్ స్టేషన్‌లో అరెస్టైన టీడీపీ నాయకులు



కొల్లూరులో పోలీసుల నిర్బంధంలో ఉన్న టీడీపీ నాయకులు

విదర్భపై 5 వికెట్లతో ఉత్తరప్రదేశ్ గెలుపు



శోభాదేవి (88 పరుగులు)



రూపాలి సహారే (58 పరుగులు)

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 5: బీసీసీఐ అండర్-23 మహిళల వన్డే టోర్నీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో విదర్భపై ఉత్తరప్రదేశ్ జట్టు 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత టాస్ గెలిచిన బ్యాటింగ్ ఎంచుకున్న విదర్భ జట్టు 48 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటయింది. రూపాలి సహారే 58, ఆయుషి ఠాక్రే 39 పరుగులు చేయగా, ఉత్తరప్రదేశ్ బౌలర్లు ఫలక్ నాజ్, అర్చనాదేవి మూడేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరప్రదేశ్ జట్టు 48.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఉత్తరప్రదేశ్ బ్యాటర్లు శోభాదేవి 88 పరుగులు, వర్తిక 45 పరుగులు, శిప్రా గిరి 42 పరుగులు చేయగా, విదర్భ బౌలర్లు అయుషి ఠాక్రే, తృప్తి లోధే రెండేసి వికెట్లు పడగొట్టారు. ఈ టోర్నీలో భాగంగా తదుపరి మ్యాచ్ ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య ఈ నెల 7వ తేదీన మంగళగిరి ఏసీఏ మైదానంలో జరుగనుంది.

రైతుల ప్లాట్లలో మట్టి మాయం

తుళ్లూరు, ఫిబ్రవరి 5: రాజధాని ప్రాంతంలో రైతుల ప్లాట్లలో అక్రమార్కులు మట్టి మాయం చేస్తున్నారు. వెంకటపాలెం నుంచి కృష్ణాయపాలెం వెళ్లే మార్గంలో ఓ రైతు ప్లాట్లలో మట్టిని రాత్రి వేళ తరలిస్తున్నారు. గతంలో ఇదే ప్లాటులో మట్టిని కాజేస్తుంటే జేసీబీ, లారీని రైతులు పట్టుకొని పోలీసులకు అప్పజెప్పారు. అప్పట్లో ఇద్దరిపై కేసు నమోదైంది. గత రెండు రోజుల నుంచి అదే ప్రాంతంలో మరలా మట్టిని తీసుకెళుతుండటంతో సోమవారం ఆ రైతు పోలీసులను ఆశ్రయించినట్టు సమాచారం. రాజధాని ప్రాంతంలో వేసిన రోడ్లను తవ్వి కంకరు మాయం చేసిన ఘటనలు కూడా గతంలో జరిగాయి. అలాగే ఐరన్, మట్టి, ఇసుక వంటి వాటిని కూడా గతంలో అక్రమార్కులు మాయం చేశారు.

తెనాలి రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తిమృతదేహం

తెనాలి క్రైం, ఫిబ్రవరి 5: తెనాలి రైల్వేస్టేషన్‌లో అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు సోమవారం తెలిపారు. స్టేషన్‌లోని 4వ నెంబరు ప్లాట్‌ఫారంపై ఓ వ్యక్తి మృతి చెందాడన్న సమాచారంతో వెళ్ళి పరిశీలించగా 55-60 సంవత్సరాల గల వ్యక్తి అనారోగ్యంతో మృతిచెంది ఉండగా గుర్తించామన్నారు. మృతుని వద్ద ఎలాంటి సమాచారం లభించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రైలు ఢీ కొని వ్యక్తి..

తెనాలి క్రైం, ఫిబ్రవరి 5: తెనాలి-విజయవాడ ప్రధాన రైలుమార్గంలో పెదవడ్లపూడి రైల్వే స్టేషన్ వద్ద గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వరరావు (77) ఆదివారం మధ్యాహ్నం టీ తాగడం కోసం రైల్వేస్టేషన్ పక్కన టీ దుకాణం వద్దకు బయలుదేరాడు.ఈ క్రమంలో రైల్వేట్రాక్ దాటుతుండగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో మృతుని కొంత భాగం పెదవడ్లపూడి రైల్వే ట్రాక్ పక్కన పడిపోగా, మరి కొంత భాగం దుగ్గిరాల రైల్వే స్టేషన్ పరిధిలో పడిపోయింది. దీనిపై తెనాలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

మృతదేహంతో బంధువుల నిరసన

చేబ్రోలు, ఫిబ్రవరి5: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చల్లపల్లి విజయ్ మృతదేహంతో సోమవారం బంధువులు చేబ్రోలు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాకు దిగ్గారు. చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన విజయ్ గుంటూరులో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ద్విచక్రవాహనంపై బయల్దేరిన విజయ్ చేబ్రోలు వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదులో తమకు అన్యాయం జరిగిందంటూ మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను మార్చారని ఆరోపిస్తున్నారు. రెండు గంటల పాటు ఈ నిరసన ధర్నా కొనసాగటంతో రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకొని నిరసన కారులకు నచ్చచెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు.



చేబ్రోలు పోలీస్ స్టేషన్ వద్ద మృతదేహంతో ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.43 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	124, 133,144
చికెన్ విత్ స్కిన్	234.00
చికెన్ స్కిన్ లెస్	244.00

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 98,671 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 88,652 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డులో 80,882 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	17000	17000
334	8000	19000	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు. 5	13300	18000	తేజ	9000	21000
273	12500	16500	బ్యాడిగి	10500	18500
341	11500	19000	దేవనూరుడీలక్స్	10500	20500
4884	--	--	తెల్లకాయలు	5000	12000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వేగేశన నరేంద్రవర్మ, వెంకటశివన్నారాయణ

అభివృద్ధి, సంక్షేమమే టీడీపీ అజెండా

● బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల,ఫిబ్రవరి 5 : అభివృద్ధితోపాటు ప్రజాసంక్షేమమే టీడీపీ, జనసేన పార్టీల ధ్యేయమని టీడీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. 'ఇంటింటికి టీడీపీ, మీమాట-నాబాట' కార్యక్రమం సోమవారం కొండుభొట్లవారిపాలెం, బేతపూడి గ్రామాలలో, అలాగే పట్టణంలోని సూర్యలంకరోడ్డులో నిర్వహించారు. టీడీపీ, జనసేన పార్టీశ్రేణులతో కలిసి వేగేశన ఇంటింటికెళ్ళి మహిళలకు చీర, సంచి, కరపత్రాలు అందజేశారు. రాష్ట్రాభివృద్ధిని గాడిన పెట్టి, ప్రజలకు సంక్షేమ పాలన అందించేందుకు టీడీపీ, జనసేనలు కలిసి ముందుకొస్తున్నాయన్నారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రం ప్రగతి పథంలో పయనించాలంటే జనసేన, టీడీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, కర్లపాలెం జడ్పీటీసీమెంబరు పిట్ల వేణుగోపాలరెడ్డి, మహిళా నాయకులు చెన్నుపాటి హైమావతి, కట్టా సుజాత, బొద్దుకూరి విజయ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

రూ. కోటితో ఆరామక్షేత్ర భవన నిర్మాణం

బాపట్ల,ఫిబ్రవరి 5 : భావపురి బ్రాహ్మణ సమైక్య ఆధ్వర్యంలో రూ. కోటి వెచ్చించి ఆరామక్షేత్ర భవననిర్మాణం చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. పట్టణంలో బ్రాహ్మణ సమైక్య అధ్యక్షుడు నిభానుపూడి శ్రీహరి ప్రకాష్ అధ్యక్షతన ఆ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 14న భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ద్వారా వచ్చిన నిధుల నుంచి 10 మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జగనన్నకాలనీలలో గృహ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సోమరాజు శ్రీనివాస్, రాఘవస్వామి, శ్రీకాంత్, కోదండరామారావు, హరినాథశర్మ, గూడ వెంకటభట్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహాప్రస్థానం అభివృద్ధికి విరాళం

బాపట్లరూరల్, ఫిబ్రవరి 5 : బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెం గ్రామం లోని మహాప్రస్థానంకు రూ.10,116 మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ బాపట్లశాఖ కోశాధికారి, ఎన్టీఆర్ క్లబ్ మెంబరు వంకాయలపాటి హరిబాబు విరాళం ప్రకటించారు. ఈమేరకు సోమవారం మహాప్రస్థానం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పంగులూరి గోపాలరావుకు ఆయన నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు తన వంతు ఆర్థిక సాయం చేయూతనందించటానికి సిద్ధంగా ఉంటానని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మెట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మోటారు వాహనాల తనిఖీ అధికారి డీబీవీ రంగారావు

సకాలంలో స్పందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు

● మోటారు వాహనాల తనిఖీ అధికారి డీబీవీ రంగారావు

బాపట్ల,ఫిబ్రవరి 5 : రోడ్డు ప్రమాదం జరిగిన సకాలంలో స్పందించి బాధితులకు సరైన వైద్య చికిత్సను అందించగలిగితే ప్రాణాలు కాపాడవచ్చని బాపట్ల మోటారు వాహనాల తనిఖీ అధికారి డీబీవీ రంగారావు తెలిపారు. బాపట్ల ఏరియావైద్యశాలలో సోమవారం 35వ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ.. మంచి సహాయకుడిగా రహదారి ప్రమాద బాధితులకు 'సహాయం అందించుదాం -ప్రాణాలు కాపాడుదాం' అనే నినాదంతో ప్రతి ఒక్కరు ముందుకు వెళ్ళాలన్నారు. క్షతగాత్రులకు నిస్వార్థంగా, స్వచ్ఛందగా ఆస్పత్రికి చేర్చేవారికి చట్టప్రకారం 'గుడ్ సమరిటన్' కల్పించబడిందన్నారు. కార్యక్రమంలో ఏరియావైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్ధ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, సహాయ వాహన తనిఖీ అధికారి పి.అంకమ్మరావు, బి.కిషోర్‌బాబు, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



నీటితో నింపుతున్న సమ్మర్‌స్టోరేజ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

చెరువును పూర్తి స్థాయిలో నీటితో నింపాలి

● మునిసిపల్ కమిషనర్ కే.రామచంద్రారెడ్డి

బాపట్ల, ఫిబ్రవరి 5 : పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌ను పూర్తి స్థాయి నీటితో నింపాలని మునిసిపల్ కమిషనర్ కే.రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. పిటి ఛానల్ నుంచి మోటర్ల ద్వారా చెరువును నీటితో నింపటాన్ని సోమవారం సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన మోటర్లకు అదనంగా మరి కొన్ని ఏర్పాటుచేసి పూర్తిస్థాయిలో నీటిని నింపాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కే.శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. అదేవిధంగా పట్టణంలోని వివిధ ప్రాంతాలలో పారిశుధ్య పనుల నిర్వాహణను కమిషనర్ పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

వేలం ద్వారా రూ.8.90 లక్షల ఆదాయం

కొల్లూరు, ఫిబ్రవరి 5: గ్రామ పంచాయతీకి బహిరంగ వేలం ద్వారా రూ.8.90 లక్షల ఆదాయం సమకూరినట్లు పంచాయతీ కార్యదర్శి బీ.మల్లికార్జున తెలిపారు. సోమవారం కొల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బస్టాండ్ సెంటర్లో ఉన్న షాపింగ్ కాంప్లెక్సులోని ఏడు షాపులకు వేలం నిర్వహించారు. 14 మంది బహిరంగ వేలంలో పాల్గొని ఊహించని విధంగా ఆరు షాపులను అత్యధిక ధరకు దక్కించుకున్నారు. ఒక్కొక్క పాటదారుడు పాటలో పాల్గొనేందుకు దారావత్తుగా రూ.50 వేలు చెల్లించారు. షాపు వేలం పాటను రూ.2 వేల నుంచి ప్రారంభించారు. షాపులు దక్కించుకున్న వారు సంవత్సరానికి మొత్తం రుసుంను మార్చి 1 లోగా చెల్లించి షాపును స్వాధీనం చేసుకోవాలని ఈవో సూచించారు. వేలం కాల పరిమితి మూడు సంవత్సరాలని ఈ సందర్భంగా ఈవో తెలిపారు.

బండ్లమ్మ ఆలయంలో హుండీ చోరీ

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 5: మండల కేంద్రమైన పిట్టలవానిపాలెం గ్రామ పంచాయతీలోని బండ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో గుర్తుతెలియని దుండగులు కానుకల హుండీలను పగలగొట్టి నగదును దోచుకెళ్లారని గ్రామస్థులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భక్తులు నాలుగు నెలలుగా సమర్పించిన కానుకల నగదును దొంగలు అపహరించుకొని వెళ్ళినట్లు గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు ట్రైనీ డీఎస్పీ విద్యశ్రీ సిబ్బందితో సంఘటన స్థలాన్ని వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో సంఘవేలి ముద్రలను సేకరించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అర్జీలు పునరావృతం కాకుండా చూడాలి

● స్పందనలో కలెక్టర్ పీ.రంజిత్‌బాషా
● బాధితుల నుంచి వినతుల స్వీకరణ.. పరిష్కారానికి ఆదేశం



అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ పీ.రంజిత్‌బాషా

బాపట్ల, ఫిబ్రవరి 5: స్పందనలో వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పీ.రంజిత్‌బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీదారులు వారి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. అర్జీదారులతో సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కరించతగినవి సత్వరమే పరిష్కరించి మిగిలినవి ఆయా శాఖాధికారులకు విచారణ నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వస్తున్న అర్జీలను సక్రమంగా పరిష్కరించకపోవటంతోనే పునరావృతం అవుతున్నాయన్నారు. ప్రజల నుంచివచ్చే అర్జీలు గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రజలలో విశ్వసనీయత కల్పించాలన్నారు.

గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా ఈనెల 9న అన్ని గ్రామాలలో జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశించిన అంశాలకు సంబంధించిన ఆయా శాఖలలో పురోగతిని అధికారులు నిశితంగా పరిశీలించాలన్నారు. నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలో సంబంధిత మాత్రలను పంపిణీ చేయాలన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేకంగా రూపొందించిన గోడపత్రికలు, కరపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు. ఇంటి స్థలాల ధరఖాస్తుల నమోదు ప్రక్రియ తక్షణమే పూర్తి చేయాలని జేసీ సీహెచ్.శ్రీధర్ తెలిపారు. రీసర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో రోవర్స్ యంత్రాలు వినియోగించి శాశ్వత ధ్రువపత్రాలు సిద్ధం చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను తక్షణమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆర్డీవోలు, ఎంపీడీవోలను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో టి.వెంకటరణ, అధికారులు పాల్గొన్నారు.

బాపట్లరూరల్ : తమ కాలనీలో నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపివేయాలంటూ చీరాల మండలం కొత్తపాలెం పంచాయతీ శ్రీనివాస్ కాలనీ ప్రజలు స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ఎస్పీ 'స్పందన'కు 49 ఫిర్యాదులు

బాపట్ల,ఫిబ్రవరి 5 : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 49 మంది అర్జీలు అందజేశారు. సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఎస్పీ వకుల్ జిందాల్ వీలైనంత వేగంగా పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా చట్టపరిధిలో విచారించి సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ టీ.వెంకటేశులు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రానున్నది టీడీపీ-జనసేన ప్రభుత్వమే

● అనగానికి అండగా ఉండాలి : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి

రేపల్లె, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో టీడీపీ-జనసేన సంయుక్త ప్రభుత్వమే అధికారంలోకి రానున్నదని ప్రజలంతా అనగానికి అండగా ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. రేపల్లె నియోజకవర్గ ఓటర్ల ఆత్మీయ సమావేశాన్ని సోమవారం హైదరాబాద్‌లోని నిజాంపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేపల్లె ప్రాంతాన్ని టీడీపీ హయాంలో అనగాని సత్యప్రసాద్ రూ.2 వేల కోట్ల పైచిలుకతో నాలుగు మండలాలను అభివృద్ధి చేశారన్నారు. వైసీపీ ఐదేళ్ళ పాలనలో రేపల్లె నియోజకవర్గం అభివృద్ధికి నోచుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు, ప్రజలపై కక్షసాధింపులు తప్పితే రాష్ట్రాన్ని జగన్‌రెడ్డి చేసిందేమీ లేదన్నారు. చంద్రబాబునాయుడు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి బాట పడుతుందన్నారు. రేపల్లె నియోజకవర్గ ఓటర్లంతా ఎమ్మెల్యే అనగానికి అండగానిలిచి ఆయన హ్యాట్రిక్ విజయానికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వీరవల్లి శివరామకృష్ణ, చైతన్యవేదిక అధ్యక్షులు కొండపల్లి వెంకటేశ్వరరావు, గోగినేని భాను, దాసరినాగరాజు, యేమినేని సీతారామ్, జనసేన నగరం మండల అధ్యక్షుడు గోపిరాజు, ఉదయకృష్ణ, మొహమాటం పృధ్వీ ఆళ్ళచౌదరి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రేపల్లె ప్రాంత వాసులు, మాట్లాడుతున్న శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

ఘనంగా ఎస్టీయూ 77వ వార్షికోత్సవం

బాపట్లటౌన్, ఫిబ్రవరి 5: స్థానిక ఎన్జీవో హోంలో సోమవారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) 77వ వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆసంఘ రాష్ట్ర అధ్య క్షుడు సాయి శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంకోసం ఎస్టీయూ తీవ్రంగా కృషిచేస్తుందన్నారు. సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని, ప్రతినెల 1నే ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. 117 జీవోను రద్దు చేయాలన్నారు. అనంతరం కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో రామచంద్రారావు, చందు వెంకటేశ్వరరావు, బడుగు శ్రీనివాస్, గుడివాడ అమర్‌నాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సర్పంచ్‌ల 'ఛలో అసెంబ్లీ'

బాపట్లటౌన్, ఫిబ్రవరి 5: సర్పంచ్‌లకు గౌరవవేతనాన్ని పెంచాలని, 14,15 ఆర్థిక సంఘ నిధులు విడుదల చేయాలని, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం సర్పంచ్‌లు ఛలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. జిల్లాలోని సర్పంచ్‌లంతా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘం కార్యదర్శి టి.కృష్ణమోహన్ కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం ఇంతలా సర్పంచ్‌లను ఇబ్బంది పెట్టింది లేదన్నారు. వైసీపీ పాలనలో సర్పంచ్‌లకు ఏ అధికారాలు, బాధ్యతలు, ప్రజలతో సంబంధాలు లేకుండా పోయాయన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పాలనా వ్యవస్థలను నడిపించటం రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలలో సర్పంచ్‌లు అంతా ఐక్యంగా కలిసి వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పటానికి సిద్ధంగా ఉన్నారని కృష్ణమోహన్ స్పష్టంచేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిరస్కరించండి

బాపట్లటౌన్, ఫిబ్రవరి 5 : బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిరస్కరించాలని సీపీఐ జిల్లా నేత జేబీ.శ్రీధర్ ప్రజలకు సూచించారు. సోమవారం జిల్లా సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అనుసరించే కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను తిరస్కరిస్తూ ఈనెల 16న దేశవ్యాప్తంగా చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ముత్తిరెడ్డి శ్రీనివాసరావు, బత్తుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చుండూరు సీఐగా శ్రీనివాస్

చుండూరు ఫిబ్రవరి 5 : చుండూరు సీఐగా సీ.హెచ్.ఎల్.ఎన్.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా రైల్వే శాఖ నుండి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని శ్రీనివాస్ తెలిపారు. మండలంలో పేకాట, కోడి పందాలు, అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

వేమూరు, ఫిబ్రవరి 5: మండలంలోని జంపని ఎస్సీకాలనీకి చెందిన జనసేనపార్టీ కార్యకర్త మాతంగి నాగరాజు తండ్రి నాంచారయ్య అనారోగ్య కారణాలతో ఆదివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఊస రాజేష్ సోమవారం నాంచార్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తంగా రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఆయనతో పాటు పార్టీ నేతలు చావలి గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు, దాది సీతారామయ్య, బండారు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీనివాస కల్యాణం

భట్టిప్రోలు, ఫిబ్రవరి 5 : మండలంలోని పెదపులివర్రు గ్రామ పరిధిలోని గుత్తావారిపాలెంలో సోమవారం శ్రీనివాస కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. స్వామివార్లకు పూజలు, నిర్వహించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. అర్చకుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీనివాస కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గోవింద నామస్మరణతో ప్రాంగణం మారుమ్రోగింది. అనంతరం అన్న సమారాధనలో భక్తులు పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవాన్ని జంపని వీరయ్య, శివ దుర్గాప్రసాద్, గ్రామ పెద్దలు పర్యవేక్షణ చేశారు.

చేనేత కార్మికులకు మజూరీలు పెంచాలి

భట్టిప్రోలు, ఫిబ్రవరి 5: చేనేత సహకార సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులకు తక్షణమే మజూరీలు పెంచాలని కార్మికసంఘం జిల్లా కమిటీ నేతలు మురుగుడు సత్యనారాయణ, దీపాల సత్యనారాయణలు డిమాండ్ చేశారు. భట్టిప్రోలు చేనేత సహకార సొసైటీ వర్క్‌షెడ్ వద్ద సోమవారం ఉదయం కార్మికులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మంగళగిరిలో చేనేత కార్మికులకు మాస్టర్ వీవర్లకు జరిగిన ఒప్పందం ప్రకారం గతేడాది నవంబర్ 15 నుండి మజూరీలను పెంచారన్నారు. కానీ చేనేత సహకార సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులకు నేటివరకు మజూరీలు పెంచలేదని, ఈ ప్రాంతాలల్లోని చేనేత సహకార సంఘాలన్నీ ప్రత్యేకాధికారుల ఏలుబడిలో ఉన్నాయన్నారు. సహకార సంఘాల్లోని చేనేత కార్మికులకు తక్షణమే మజూరీలు పెంపుదల చేయాలని లేకుంటే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బీ.నాగమల్లేశ్వరరావు, ఏ.శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకారం

కొల్లూరు, ఫిబ్రవరి 5: ప్రకాశం జిల్లా నుంచి బదిలీపై కొల్లూరు కొల్లూరు మండల తహసీల్దార్‌గా వచ్చిన వీ.పుల్లారావు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ త్రివేణి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ తేజ, శ్యామల తదితరులు తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రేపల్లె : నిజాంపట్నం తహసీల్దార్‌గా నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన నెల్లూరుజిల్లా సంగం తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై నిజాంపట్నం వచ్చారు.

భట్టిప్రోలు : భట్టిప్రోలు మండల తహసీల్దార్ ఎం. సుభద్ర బాధ్యతలు చేపట్టారు. నెల్లూరుజిల్లా ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తూ ఎన్నికల బదిలీలలో భాగంగా భట్టిప్రోలు విచ్చేశారు. ఈ సందర్భంగా సుభద్రకు ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్‌వోలు, డీలర్లు, కార్యాలయ సిబ్బంది, పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం మండల తహసీల్దార్ ఐ. మునీలక్ష్మీ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ఆర్ఐ అమానుల్లాఖాన్, సర్వేయర్ లక్ష్మీనారాయణ, సీనియర్, జూనియరల్ అసిస్టెంట్‌లు విక్టర్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

రేపల్లె : తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు రేపల్లె తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. శాఖా పరమైన సేవలను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అందిస్తానని రవీంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో అన్నివర్గాలకు ఆదరణ

బాపట్ల,ఫిబ్రవరి 5 : అన్ని వర్గాల ప్రజలను ఆదరించే టీడీపీపై తప్పుడు కథనాలు రాయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు, సీనియర్ నేత తోట నారాయణరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. టీడీపీకి పెరుగుతున్న ప్రజాధరణ చూచి తట్టుకోలేకే జగన్ పత్రిక తప్పుడు కథనాలు రాస్తుందని విమర్శించారు. యాదవ, ఎస్సీ సామాజికవర్గాలను టీడీపీ నిర్లక్ష్యం చేస్తుందని, ఈ వర్గాలపై భౌతికదాడులు చేసిందని జగన్‌పత్రిక అసత్య కథనాలు రాయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, నక్కల వీరరాఘవయ్య, వెంకటస్వామి, వడ్లమూడి వెంకటేశ్వర్లు, బడుగు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల కోసం పడిగాపులు

● నిలిచిన సర్వర్ .. స్తంభించిన కార్యకలాపాలు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 5 : రిజిస్ట్రేషన్లకు సంబంధించి సర్వర్ మొరాయించడంతో ప్రజలు సోమవారం స్థానిక సబ్ రిజిస్ట్రారు కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్ స్తంభిచడంతో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. దీంతో వివిధ రిజిస్ట్రేషన్‌ల కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలు చేసేది లేక సాయంత్రం వరకు వేచి ఉండి వెనుదిరిగారు. ఇటీవల కాలంలో ఇదేవిధంగా అనేకమార్లు సర్వర్ మొరాయిస్తుండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సబ్ రిజిస్ట్రారు సునీల్‌దత్ బాబును వివరణ కోరగా.. రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ నిలిచిపోవడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ఆటంకం ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్ళామన్నారు.



స్థానిక సబ్ రిజిస్ట్రారు కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు



పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆనందబాబు

ఎప్పుడు ఎన్నికలు వచ్చినా విజయం టీడీపీదే..

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

అమర్తలూరు, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో ఏ క్షణంలో ఎన్నికలు వచ్చినా విజయం మాత్రం టీడీపీ, జనసేన కూటమిదేనని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ప్యాపర్రు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరగా వారికి పసుపు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ఒక్క ఛాన్సు అంటూ మాయమాటలతో అధికారం చేపట్టిన జగన్ తన పాలనాకాలంలో అన్నిరంగాలను నాశనం చేశారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అంగుళం కూడా కనిపించడం లేదని, యువత ఉపాధి లేక అవస్థలు పడుతున్నారని, ఈ సైకో దుష్టపాలనకు చరమగీతం పాడాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల, గ్రామ నాయకులు పలువురు పాల్గొన్నారు.

భోజన నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

బాపట్ల,ఫిబ్రవరి 5 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మజుందార్ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ధర్నాను ఉద్దేశించి మజుందార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 10వేల వేతనం ఇవ్వాలని, ప్రతి నెల 5వ తేదిలోపు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికునికి రూ. 10 లక్షల బీమా ఇవ్వాలని, మెనూ ఛార్జీలను రూ.20 ఇవ్వాలని, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్పందనలో డీఆర్‌వో పి.వెంకటరమణకు వినపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు వెంకటేశ్వరమ్మ, కోటేశ్వరమ్మ, గీత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మహిళల జట్టుకు బహుమతి ప్రధానం చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

క్రీడల్లో బాపట్ల కీర్తిని చాటాలి : కలెక్టర్

● ముగిసిన ఆడుదాం ఆంధ్ర జిల్లాస్థాయి పోటీలు
● విజేతలకు బహుమతుల ప్రదానం

బాపట్ల,ఫిబ్రవరి 5: క్రీడల్లో బాపట్ల కీర్తిని రాష్ట్ర నలుమూలలా చాటాలని కలెక్టర్ పీ.రంజిత్‌బాషా తెలిపారు. ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి క్రీడా పోటీలు ముగింపు సభా కార్యక్రమాన్ని సోమవారం బాపట్ల మునిసిపల్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించటానికి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ స్థాయిలలో పోటీలను నిర్వహించడం ఎంతో మంచి విషయమన్నారు. జిల్లా స్థాయిలో 28 టీమ్‌లు ఈ పోటీలలో తలపడ్డాయన్నారు. జిల్లా స్థాయిలో ముగిసిన ఈ క్రీడాపోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఖోఖో క్రీడలో బాలుర విభాగంలో జె.పంగులూరు జట్టు ప్రథమస్థానం, బాపట్ల జట్టు ద్వితీయస్థానం, బాపట్లమండలం యాజలి జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. ఖోఖో క్రీడ బాలికల విభాగంలో బాపట్ల ప్రథమ బహుమతి, పర్చూరు ద్వితీయ బహుమతి స్వంతం చేసుకున్నాయి. కబడ్డీలో పర్చూరు ప్రథమ స్థానం, బాపట్ల ద్వితీయ స్థానం, చీరాల తృతీయ స్థానంలో నిలిచాయి. కబడ్డీ బాలికల విభాగంలో బాపట్ల ప్రథమ స్థానం, వేమూరు ద్వితీయ స్థానం, అద్దంకి తృతీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్ పోటీలలో బాలుర విభాగంలో బాపట్ల ప్రథమ స్థానం, చీరాల ద్వితీయ స్థానం, రేపల్లె తృతీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్ బాలికల విభాగంలో రేపల్లె ప్రథమ స్థానం, బాపట్ల ద్వితీయ స్థానం, అద్దంకి తృతీయ స్థానంలో నిలిచాయి. క్రికెట్‌లో చీరాలజట్టు ప్రథమస్థానంలో నిలిచింది. బ్యాడ్మింటన్‌లో పర్చూరు ప్రథమ స్థానంలో, చీరాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన జట్లకు కలెక్టర్, జేసీ చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

అరాచక పాలన తరిమికొట్టాలి

రేపల్లె, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలని టీడీపీ సీనియర్ బీసీనేత బొమ్మిడి రామకృష్ణ అన్నారు. సోమవారం నిజాంపట్నం మండలం ఆముదాలపల్లిలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చాడని, రాష్ట్రంలో రౌడీయిజం, భూకబ్జాలు, ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు తప్పా అభివృద్ధి ఊసేలేదన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అధిక భారం మోపారని విపరీతంగా పెరిగిపోయిన నిత్యవసర వస్తువుల, విద్యుత్, ఆర్టీసీ, పెట్రోల్, డీజీల్ ధరలు పెరిగిపోవటంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. రానున్న రోజుల్లో అనగానికి అండగా ఉండి వైసీపీ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలసాని రాము, పెరుగు బాబూరావు, మరకా మునలయ్య, పీవీ చింతారావు, తదితరులు పాల్గొన్నారు.

తాకట్టు పెట్టిన బంగారం ఇవ్వడంలేదు

● న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

రేపల్లె, ఫిబ్రవరి 5 : పేదలు తాకట్టుకి ఇచ్చిన బంగారాన్ని విడిపించుకోవడానికి నగదు జమ చేస్తామన్న కూడా బంగారం ఇవ్వకుండా ఓ మహిళ ఇబ్బంది పెడుతుందని సోమవారం బాధితులు డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పటణంలోని ఏకలవ్య కాలనీ 7వ వార్డుకు చెందిన రెక్కాడితే డొక్కాడని ఎస్టీ సామాజిక తరగతికి చెందిన పేదలు 15 కుటుంబాల వారు పట్టణంలోని 27వ వార్డుకు చెందిన కూరగంటి వరలక్ష్మీ అనే మహిళ వద్ద సుమారు రూ. 7 లక్షలు విలువ చేసే బంగారం తాకట్టు పెట్టారు. తీసుకున్న నగదు తిరిగి ఇచ్చి వేస్తామని, తమ నగలు ఇవ్వాలని వారు ఎన్నిసార్లు అడిగినా వరలక్ష్మి సమాదానం దాటవేస్తూనే వసుతందన్నారు. అయితే ఇటీవల గట్టిగా నిలదీయగా ప్రస్తుతం తన వద్ద బంగారం లేదంటూ సమాదానం చెబుతుందని వాపోయారు. ఈ విషయమై స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవటంతో డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయంలో తక్షణమే విచారించి బాధితులకు న్యాయం చేయాలని ఏపీ ఎరుకుల ఆత్మగౌరవ సేవాసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.అంకాలు డీఎస్పీని కోరారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 5 : డ్వాక్రా మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండల పరిధిలోని ఖాజీపాలెం గ్రామసచివాలయంలో వై.ఎస్.జగన్మోహనరెడ్డి వైఎస్సార్ ఆసరా (4వ విడత) సభలో ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాభివృద్ధికి ఎంతగానో పెద్ద పీట వేస్తూనే విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం ఆర్థిక వెసులబాటు కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి 773 గ్రూపులకు చెందిన డ్వాక్రా మహిళలకు రూ.6కోట్ల 35లక్షల చెక్కును అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అనంతరం వర్మను సర్పంచ్ కే.అనూష ప్రసన్నను, పలువురు ప్రజా ప్రతినిధులను, అధికారులను ఎమ్మెల్యే కోన రఘుపతి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాపట్ల మాజీఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు, ఎంపీపీ షేక్.బాజీ, ఖాజీపాలెం సర్పంచ్ కె.అనూష ప్రసన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నేత దాడి

మార్టూరు, ఫిబ్రవరి 5: బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న టీడీపీ కార్యకర్త విప్పర్ల బాలకృష్ణపై వైసీపీ నేత దాడి చేశారు. ఈ సంఘటన సోమవారం ఉదయం డేగరమూడి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదర్శ కాలనీ వద్ద చోటుచేసుకుంది. గత కొన్ని రోజులుగా ఈ గ్రామంలో టీడీపీ కార్యకర్తలు బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా సోమవారం ఆదర్శ కాలనీలో టీడీపీ కార్యకర్త విప్పర్ల బాలకృష్ణ ఇంటింటికి తిరుగుతూ కార్యక్రమం గురించి ప్రజానీకానికి వివరిస్తున్నారు. ఈ సమయంలో మహిళా సర్పంచ్ భర్త వైసీపీ నేత వీరయ్య ఆదర్శ కాలనీకి వచ్చి, ఇక్కడ నీకేమి పనంటూ కర్రతో భౌతిక దాడి చేసినట్లు బాలకృష్ణ తెలిపారు. అనంతరం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్ నుంచి కానిస్టేబుల్ బాలకృష్ణకు ఫోన్‌చేసి సీఐ రమ్మన్నారని తెలిపారు. దీంతో భయపడిన బాలకృష్ణ గ్రామం నుంచి పరారయ్యారు. పార్టీ గురించి ప్రచారం చేసుకోవడం నేరమా అంటూ గ్రామ టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయమై మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర రెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా వీర్య ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనన్నారు. గ్రామానికి చెందిన బాలకృష్ణ మరో వ్యక్తితో కలిసి ఇంటింటా తిరుగుతూ వారి సెల్ ఫోన్‌లను తీసుకొని వారే పార్టీకి చెందిన యాప్‌లను లోడ్ చేస్తున్నారని చెప్పారు. ఈ విషయమై అతను ఫిర్యాదు చేసినట్లు రాజశేఖర రెడ్డి తెలిపారు. దీనిపై విచారణ చేయడానికి బాలకృష్ణను పిలిపించామన్నారు. కేసు నమోదు చేయలేదన్నారు.

వార్షిక తిరునాళ్ల బాలాలయంలోనే!

- సా..గుతున్న శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి మండపం నిర్మాణం
- ఏప్రిల్ దాటితే ముహూర్తం కోసం మరో 6 నెలలు ఆగాల్సిందే..
- 20 నెలల క్రితమే శంకుస్థాపన
- 5నెలల క్రితమే పనులు ప్రారంభం

అద్దంకి, ఫిబ్రవరి 5: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం రాతి మండపం నిర్మాణ పనులకు 20 నెలల క్రితం శంకుస్థాపన జరిగినా... ఐదు నెలల క్రితమే పనులు ప్రారంభమయ్యాయి.. మార్చి 25వ తేది శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాం జనేయస్వామి వార్ల వార్షిక తిరునాళ్ల ఉంది. తిరునాళ్లకు లక్షకు పైగా భక్తులు వస్తారు. గత ఏడాది అక్టోబరు నెలలో రాతి ముఖ మండపం పనులు ప్రారంభించే సమయంలో దేవాలయం ప్రాంగణంలో బాలాలయం ఏర్పాటుచేసి ప్రత్యేకంగా తయారుచేసిన విగ్రహం ఉంచి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. తిరునాళ్లకు పనులు ఎట్టి పరిస్థితులలో పూర్తయ్యే అవకాశం లేకపోవటంతో భక్తులు బాలాలయంలోనే స్వామి వారిని దర్శించుకోవాల్సి ఉంటుంది. అయితే, ఏప్రిల్ 15 నాటికి పనులు పూర్తిచేసి కుంభాభిషేకం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఏప్రిల్ నెలలో కుంభాభిషేకం జరగకపోతే ముహూర్తాల కోసం నవంబర్ నెల వరకు సుమారు ఆరు నెలలపాటు ఆగాల్సి ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో రాతి మండపం నిర్మాణం కోసం టీటీడీ నుంచి రూ.2 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. మరో రూ. 2 కోట్లు దాతల సహకారంతో సేకరించేలా పనులు ప్రారంభించారు. అయితే, అంచనా వ్యయం పెరగటంతో మరో కోటి రూపాయలు టీటీడీ నుంచి మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాద నలు పంపారు.

ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కోట శ్రీనివాసకుమార్ రాతి గోడకు అవసరమైన గ్రానైట్‌ను సమకూర్చారు. ఇప్పటివరకు మరో 25 మంది భక్తులు లక్ష రూపాయలు చొప్పున విరాళాలు ఇచ్చారు. మరి కొంతమంది విరాళాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇక మండపంపై గోపురం నిర్మాణానికి ఒక దాత సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. శంకుస్థాపన శిలాఫలకాన్ని 2022 జూన్ 4న అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. అయితే, పనులు చాలా ఆలస్యంగా ఏడాదిన్నర తరువాత గత ఏడాది అక్టోబరులో ప్రారంభమయ్యాయి. దీంతో తిరుణాళ్లకు ఎట్టి పరిస్థితు లలోనూ పనులు పూర్తయ్యే అవకాశం లేదు.

ఇక దేవస్థాన అధికారులు నిర్ణయించుకున్న మేరకు ఏప్రిల్ 15 నాటికైనా పనులు పూర్తయి కుంభాభిషేకం జరిపిస్తారా లేక అసంపూర్తి గానే పనులు ఉంచి కుంభాభిషేకం చేస్తారా అన్న మీమాంస నెలకొంది. ఏప్రిల్ తరువాత మరో ఆరు నెలల వరకు ముహూర్తాలు లేకపోవటంతో పనులు వేగవంతంగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.


ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద నిర్మాణంలో ఉన్న రాతి మండపం


రాతి మండపం నిర్మాణానికి వేసిన శిలాఫలకం

సంతలో రుసుం వసూలు నిలిపివేత

అద్దంకి, ఫిబ్రవరి 5: అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించే సంతలో షాపుల నిర్వాహకుల నుంచి వసూలు చేసే రుసుంను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సహాయ మార్కెటింగ్ సహాయకులు, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఫణిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి యార్డులో వసూళ్ళు శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించారు. రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక పరిస్థితులలో రుసుంను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను యార్డులో నిర్వహించే సంతలో ఎలాంటి రుసుం చెల్లించే అవసరం లేకుండా అమ్ముకోవచ్చునని పేర్కొన్నారు.

పాలకవర్గంలో చర్చించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గత దశాబ్దకాలంగా మార్కెట్ యార్డులో సంత నిర్వహణ జరుగుతున్నా ఎన్నడూలేని విధంగా ఆదివారం ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రుసుం వసూలు చేయటం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. దీంతో వచ్చే ఎన్నికలలో ప్రభావం చూపుతుం దన్న ఉద్దేశంతో పాలకవర్గం వెంటనే మేల్కొని రుసుం వసూలు తాత్కాలికంగా వాయిదా వేయించినట్లు తెలుస్తుంది.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యపరీక్షలు

అద్దంకి, ఫిబ్రవరి 5: రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా సోమవారం అద్దంకి డిపోలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. 40 మంది సిబ్బందికి డాక్టర్ శ్రీనివాస్ ఉచితంగా వైద్య పరీక్షలు చేసినట్లు అసిస్టెంట్ డీఎం మహబూబీ తెలిపారు.

గుళికల మందుతిని యువకుడు ఆత్మహత్యాయత్నం

బల్లికురవ, ఫిబ్రవరి 5: మండలంలోని కొమ్మినేనివారిపాలెం ఎస్టీ కాలనీలో సోమవారం గుళికల మందుతిని పొట్లూరి చంటి అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భార్యాభర్తల మధ్య వచ్చిన కలహాల నేపథ్యంలో ఇంట్లోనే గుళికల మందు తిని అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే గమనించిన బంధువులు అద్దంకి 108కి సమాచారం అందించటంతో వారు వచ్చి ప్రథమ చికిత్స చేసి వెంటనే ఒంగోలు వైద్య శాలకు తరలించారు.

నేడు పంగులూరు మండల సర్వసభ్య సమావేశం

పంగులూరు, ఫిబ్రవరి 5: పంగులూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో మ్యాత్యుబాబు తెలిపారు. ఎంపీపీ తేళ్ళ నాగమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

పాలకమండలి నియామకానికి చర్యలు

పంగులూరు, ఫిబ్రవరి 5: పంగులూరులోని శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయ నూతన పాలక మండలి ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్టు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తిగల వారు పాలకమండలిలో సభ్యులుగా చేరేందుకు తమ పేర్లు నమోదు కోరుతూ దేవదాయశాఖ జిల్లా అధికారి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. 20 రోజులలోగా పూర్తి వివరాలతో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సెయింట్‌ఆన్స్ కళాశాల అధ్యాపకునికి డాక్టరేట్


పీహెచ్‌డీ పట్టా పొందిన అధ్యాపకుడిని అభినందిస్తున్న సెయింట్‌ఆన్స్ కళాశాల ప్రతినిధులు

చీరాల, ఫిబ్రవరి 5: సెయింట్‌ఆన్స్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న డి.జ్యోతి స్వరూప్ పీహెచ్‌డీ పట్టా పొందారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. కళాశాలలో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జ్యోతి స్వరూప్‌ను అభినందించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, అక్రిడేషన్ మేనేజర్ డాక్టర్ సి.సుబ్బారావు మాట్లాడుతూ స్టడీ ఈన్ స్ట్రెంగ్త్ అండ్ కంపాటబిలిటి ఆఫ్ సిలికోమాంగనీస్ శ్లాగ్ ఫ్లైయాష్ అండ్ ఫైబర్ రిఇన్‌ఫోర్స్‌డ్ ఫైన్‌శాండ్ అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందారన్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగ హెచ్‌వోడి ప్రొఫెసర్ సీఎస్వీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పరిశోధన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 5: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, ఈపూరుపాలెం ఎస్సై మర్రి శివకుమార్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చీరాల పరిధిలో పలువురు అధికారులు బదిలీపై వెళ్లారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన తరువాత వేర్వేరుగా వీరిరువురు ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.

శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని అన్నివిధాలుగా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అధికారులకు ఆయా కార్యాలయాల సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఆర్డీవో జీఏడీ నుంచి, ఈపూరుపాలెం ఎస్సై జిల్లా వేకెన్సీ రిజర్వు నుంచి వచ్చారు.

అద్దంకి తహసీల్దార్‌గా మహబూబ్ సుభాని

అద్దంకి, ఫిబ్రవరి 5: అద్దంకి తహసీల్దార్‌గా షేక్ మహబూబ్ సుభానీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సుబ్బారెడ్డి నెల్లూరు రూరల్‌కు బదిలీ కాగా, పెదనందిపాడు నుంచి మహబూబ్ సుభానీ బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను డీటీ సుధారాణి, ఆర్ఐ శంకర్, ఏఎస్‌వో అమర్నాథ్, రమణారావు లు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని చక్రాయపాలెంలో ఇళ్ళస్థలాల రిజిస్ట్రేషన్‌ను తహసీల్దార్ మహబూబ్ సుభానీ పరిశీలించారు.

కారంచేడు తహసీల్దార్‌గా మెహర్‌కుమార్

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 5: కారంచేడు తహసీల్దార్‌గా మెహర్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా అమృతలూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వెంకటరత్నం నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మెహర్ కుమార్‌కు సిబ్బంది అభినందనలు తెలిపారు.

మార్టూరు రూరల్ సీఐగా సీతారామయ్య బాధ్యతల స్వీకరణ

మార్టూరు, ఫిబ్రవరి 5: మార్టూరు సర్కిల్ రూరల్ సీఐగా సీతారామయ్య సోమవారం రాత్రి మార్టూరులో బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లా చిలకలూరిపేట టౌన్ సీఐగా పనిచేస్తూ మార్టూరుకు బదిలీపై వచ్చారు. ఆయన పరిధిలో యద్దనపూడి, పర్చూరు పోలీస్ స్టేషన్‌లు ఉంటాయి.

నేడు ప్రజావేదిక

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 5: గత ఏడాది మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి మంగళవారం ఉదయం పది గంటలకు ఎంపీడీవో కార్యాలయం ఆవ రణంలో ప్రజావేదిక జరుగుతుందని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఏపీవో గాయత్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాలలో ఉపాధి హామీ పనులకు సంబంధించి ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు జరిగిన పనులపై జనవరి 29 నుంచి ఫిబ్రవరి 5వ వరకు 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రజావేదికకు ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ పథకం ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు హాజరుకావాలని కోరారు.

10న జానపదాలు-జ్ఞానపదాలు గ్రంథావిష్కరణ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 5: జానపదం కళాపీఠం ఆధ్వర్యంలో ఈనెల 10న స్థానిక గీతామందిర్‌లో ఉదయం 10 గంటలకు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన జానపదాలు-జ్ఞానపదాలు గ్రంథావిష్కరణ జరుగుతుందని కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ యు.దేవపాలన తెలిపారు. సోమవారం గ్రంథావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను కళాపీఠం సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహిత్య విశ్లేషకులు అన్నమనేని వెంకట్రావు, మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, చెన్నుపాటి రామాంజనేయులు, వారణాసి రఘురామశర్మ, భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

కలిసికట్టుగా పనిచేస్తే సత్ఫలితాలు సాధ్యం

- వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్

కొత్తపేట(చీరాల), ఫిబ్రవరి 5: అందరం కలసికట్టుగా పనిచేస్తే సత్ఫలితాలు సాధ్యమవుతాయని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక సంపత్‌నగర్ మూడురోడ్ల కూడలి సమీపంలో నిర్మాణంలో ఉన్న యాదవ కల్యాణమండపంలో సోమవారం ఆయా గ్రామాల పెద్దలు, ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. పలు అంశాలను సమీక్షించారు. కార్యక్రమంలో బుర్ల వెంకట్రావు, పెరుగు భాస్కర్, కీర్తి వెంకట్రావు, వీరయ్య, గొల్లప్రోలు కృష్ణ, బుర్ల మురళి, పులి వెంకటేశ్వర్లు, పులి హరికృష్ణ, ఆతిన శ్రీనివాసరావు, ప్రసాద్, వీరాస్వామి, చుక్కా నాగలక్ష్మి, రమేష్‌యాదవ్, ఆవుల అశోక్, ఆతిన వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ.. వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 5: వేటపాలెం మండల పరిధిలోని బచ్చులవారిపాలెం యువకులకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ సోమవారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మనోవికాసం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టతరంగా మారిన గ్రానైట్ పరిశ్రమల నిర్వహణ

- యజమానుల ఆందోళన

మార్టూరు, ఫిబ్రవరి 5: గ్రానైట్ పరిశ్రమల నిర్వహణం కష్టతరంగా మారిందని యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో గ్రానైట్ పరిశ్రమల నిర్వహణ తీరుపై సోమవారం మార్టూరులోని గ్రానైట్ అసోసియేషన్ కార్యాలయంలో పరిశ్రమల యజమానులు సమావేశమయ్యారు. గతనెల 30న టీడీపీ నాయకుడు కామినేని జనార్దన్‌కు చెందిన అనంత గ్రానైట్‌లో నెల్లూరు విజిలెన్స్ ఏడీ బాలాజీ నాయక్ తమ సిబ్బందితో తనిఖీలు చేశారు. ఈసందర్భంగా జరిగిన వివాదంలో బాలాజీ నాయక్ ఫిర్యాదు మేరకు ఆరుగురు గ్రానైట్ పరిశ్రమల యజమానులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు.

ఈ కేసులో మార్టూరు గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్, మాజీ అధ్యక్షుడు ప్రసాద్ తో పాటు గ్రానైట్ యజమాని షేక్ రజాక్ కూడా ఉన్నారు. వీరికి పరిశ్రమల యజమానులు సంఘీభావం ప్రకటించారు. భవిష్యత్తులో మార్టూరు ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలను నిర్వహించడం కష్టతరంగా మారుతుందని సమావేశంలో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. విజిలెన్స్ ఏడీ ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసిన పోలీసులు, తమ ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి కేసును నమోదు చేయకపోవడంతో కొంతమంది గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఏది ఏమైనా పరిశ్రమల నిర్వహణలో ఒక స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లాలని మెజారిటీ గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఆలోచన చేసినట్లు తెలిసింది. ఈ సమావేశానికి మార్టూరు ప్రాంతంలోని 70 మందికి పైగా గ్రానైట్ పరిశ్రమల యజమానులు హాజరయ్యారు.

షర్మిల నేతృత్వంలో కాంగ్రెస్ బలోపేతం


మాట్లాడుతున్న కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం

అద్దంకి, ఫిబ్రవరి 5: కేంద్రంలో మోదీ ప్రభుత్వం పోవాలి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అందరూ కోరుకుంటున్నారని కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. షర్మిల పీసీసీ అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తున్నట్టు చెప్పారు. ప్రత్యేక హోదాపై ఎంపీలు పూర్తిగా మరిచిపోయారన్నారు. లోకసభకు పోటీచేసే వాళ్ళు సమర్థులై ఉండాలన్నారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి ఉండాలని చెప్పారు. షర్మిలపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఈవిషయమై డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. బాపట్ల ఎంపీగా పోటీ చేసేందుకు పార్టీ అవకాశం కల్పిస్తే తప్పకుండా పోటీ చేస్తానని జేడీ శీలం పేర్కొన్నారు. ఈనెల 7న బాపట్లలో షర్మిల ఆధ్వర్యంలో జరిగే రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ సోమేపల్లి శ్రీనివాసరావు, కోరే సురేంద్రనాథ్, చుండూరి నరసింహారావు, సుబ్రహ్మణ్యం, పీవీ సురేష్‌బాబు, లేళ్ళ సుబ్బారెడ్డి, ఎర్రమోతు నాగయ్య, పాలపర్తి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో సభను విజయవంతం చేయాలి

ఇంకొల్లు, ఫిబ్రవరి 5: ప్రతి కార్యకర్త కాంగ్రెసు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం అన్నారు. సోమవారం ఆయన ఇంకొల్లులో పర్చూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పొన్నంటి జానకిరామారావు గృహంలో సమావేశమయ్యారు. నియోజకర్గంలోని కార్యకర్తలతో మాట్లాడారు. ఈ నెల 7న బాపట్లలో జరగనున్న షర్మిల బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పొన్నగంటి జానకిరామారావు, శ్రీపతి ప్రకాశ్, తోట శివ నాగేశ్వరరావు, సంపత్, పోలయ్య, మోదిన్‌బాషా, యూసూఫ్, రవి, బండ్ల నాగేశ్వరరావు, భూషణం, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీఆర్‌పీఏ గౌరవాధ్యక్షుడు ఏవీ పుల్లారావు డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన పుల్లారావు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతినెలా 1వతేదీనే పెన్షన్లు ఇవ్వాలన్నారు. పీఆర్సీ డీఏ బకాయిలను మంజూరు చేయడంతో పాటు ఈపీఎఫ్ పెన్షన్లకు రూ. 10వేలు కనీస పెన్షన్‌అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషయ్య రాంబాబు మాట్లాడుతూ ం ఈనెల 8వతేదీ వరకు రిలే దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు.

వైసీపీ పతనం ఖాయం

- మాయమాటల ముఖ్యమంత్రిని సాగనంపాలి
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

బల్లికురవ, ఫిబ్రవరి 5: గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హమీలను అమలు చేయకుండా ఇప్పుడు మరలా ఎన్నికలకు సిద్ధం అని హోర్డింగులు పెట్టటం సిగ్గు చేటు అని, వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అరాంరకె, సోమవారం సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం అడ్డరోడ్డులో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బల్లికురవ మండలం కొప్పెరపాడు గ్రామ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రజలను తీవ్రంగా మోసం చేసిందన్నారు. ఇప్పటి వరకు రూ.13 లక్షల కోట్లు అప్పులు చేసి పేదలకు అరకొరగా సంక్షేమ పథకాలు అందించి పెద్ద ఎత్తున ప్రభుత్వ ధనాన్ని తన సొంత ప్యాలెస్‌కు తరలించారని ఆరోపించారు. సంక్షేమ పథకాల పేరిట పెద్ద ఎత్తున వైసీపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీలకు టీడీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను రద్దుచేసి, ఇప్పుడు వారిపై కపటప్రేమ చూపిస్తున్నారని అన్నారు. సార్వత్రిక ఎన్నికలలో ఓటమి తప్పదని గ్రహించి వైసీపీ అభద్రతాభావంలో ఉందన్నారు. కొన్నిచోట్ల అభ్యర్థులు కూడా దొరక్క మండలస్థాయి నేతలకు టిక్కెట్లు ఇస్తున్నారని అన్నారు. అన్నివర్గాల ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో టీడీపీ నేతలు షేక్ అబ్దుల్‌సాహెబ్, కామినేని నరసింహారావు, యర్రా మునలయ్య, గుంజి జీవరత్నం, వరదయ్య తదితరులు పాల్గొన్నారు.


కొప్పెరపాడు గ్రామ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

బల్లికురవ, ఫిబ్రవరి 5: మండలంలోని కొప్పెరపాడు గ్రామానికి చెందిన బీసీ, ఎస్సీ నేతలు సోమవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం అడ్డరోడ్డులో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కొప్పెరపాడు బీసీ కాలనీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు గుంజి సరోజిని, ఆమె కుమారుడు జీవరత్నం, యార్రా కోటేశ్వరరావు (మునలయ్య), బొంతా మరియబాబు, బొంతు రామయ్య బొంతు చిన్న, బొంతా యర్రయ్య రవికుమార్‌కు సంఘీభావాన్ని ప్రకటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ విజయానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షేక్ అబ్దుల్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

చెల్లికి న్యాయం చేయలేదు.. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తారంట!

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 5: 'సీఎం జగన్ చెప్పేవన్నీ కల్లబొల్లి మాటలు.. మాట తప్పటం, మడెం తిప్పటం అతని నైజం. చెల్లికి న్యాయం చేయలేదు.. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తానని చెప్పటం అందుకు నిదర్శనం' అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ధ్వజమెత్తారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని విజయ్‌నగర్ కాలనీలో ఎం.నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాలనీలో నెలకొన్న సమస్యలను ఆమె వివరించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ సీఎం జగన్ నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా మైనారిటీలు అంటూ వారినే అణగదొక్కారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నష్టపోయినవారంతా బడుగు, బలహీనవర్గాలేనన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన ఆవశకతను ప్రతిఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో నాయ కులు దుడ్డు శామ్యూల్, దుడ్డు జయరావు, తేళ్ల శేఖరబాబు, తేళ్ల దేవదా నం, ఉసిరిపాటి సురేష్, కొతవరపు జనార్దనరావు, డేటా నాగేశ్వరరావు, గంజి పురుషోత్తం, గజవల్లి శ్రీనివాసరావు, రత్నబాబు, కిషోర్, తేజ, తేలప్రోలు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య

టీడీపీ శ్రేణులను అదుపులోకి తీసుకోవటం దారుణం

చీరాల, ఫిబ్రవరి 5: టీడీపీ శ్రేణులను అదుపులోకి తీసుకోవటం దారుణమని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో సర్పంచ్‌లు పాల్గొనకుండా ముందస్తుగా నియోజకవర్గ పరిధిలోని టీడీపీ ముఖ్య నాయకులకు ముందస్తు నోటీసులు ఇచ్చి స్టేషన్లకు తరలించారు. కొండయ్యను కొంతసేపు హౌస్ అరెస్ట్ చేశారు.

ఈక్రమంలో కొండయ్య పోలీస్ అధికారులతో మాట్లాడారు. తరువాత వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడ స్టేషన్లో ఉన్న తమ పార్టీ నాయకులను వెలుపలకు తీసుకొచ్చారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతవరణానికి భంగం కలిగిం చేవిధంగా చేపట్టే చర్యలను ప్రజలు హర్షించరన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్చూరులో చిచ్చురేపుతున్న వైసీపీ

- టీడీపీ నేత జమాలుద్దీన్ ధ్వజం

పర్చూరు, ఫిబ్రవరి 5: పర్చూరులో తిరుగులేని శక్తిగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ ముస్లిం మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ జమాలుద్దీన్ అన్నారు. సోమవారం పర్చూరులోని పార్టీ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జమాలుద్దీన్ మాట్లాడుతూ ఏలూరిని రాజకీయంగా ఎదుర్కోలేక వైసీపీ పెద్దలు తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. ఇలాంటి చర్యలకు భయపడేది లేదని చెప్పారు. గత 12 ఏళ్ళుగా పర్చూరు నియోజకవర్గం ప్రశాంత వాతావరణంలో అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. ప్రస్తుత వైసీపీ పెద్దలు రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టి అలజడులు సృష్టించే విధంగా నీచమైన చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అధికారం కోసం రాజకీయంగా పోటీపడాలే తప్ప అక్రమ కేసులు బనాయించం ఏమిటని ప్రశ్నించారు. కొద్దిరోజుల క్రితం కర్రలు, కారం ప్యాకెట్లతో వైసీపీ గూండాలు మైనింగ్ అధికారులతో కలసి మార్టూరు గ్రానైట్ పరిశ్రమలలో తనిఖీలకు వచ్చారని చెప్పారు. ఇదేమిటని ప్రశ్నించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతోపాటు, టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయటం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, కారంచేడు మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఖాశీం, షేక్ హుస్సేన్, రఫీ, షేక్ గౌస్, షేక్ ట్విన్, పఠాన్ బాజీ, మస్తాన్‌వలి, ఫారూక్, సుభానీ, షేక్ అక్రమ్, రెహమాన్, షేక్ కరీముల్లా, షేక్ మహబూబ్ బాషా, షేక్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జమాలుద్దీన్

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం

చీరాలటౌన్, ఫిబ్రవరి 5: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చీరాల తహసీల్దార్ కోమటినేని నాసరయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మండల పరిధిలోని అధికారులతో సమావేశం నిర్వహించి స్థానిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో వ్యవసాయ శాఖ ద్వారా తయారుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్‌ను ప్రారంభించారు. స్టాల్ ప్రతి సోమవారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎఫ్రాయిమ్, వరదానమ్మ, భారతి, తోటవారిపాలెం, గవినివారిపాలెం యూనిట్ సిబ్బంది కవిత, శివస్వరూప, పావని, పద్మజ, రాణి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవలో స్టాల్ ఏర్పాటు.. బల్లికురవ, ఫిబ్రవరి 5: రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆశాఖ తరపున మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను సోమవారం ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి పరిశీలించారు. అనంతరం ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు నుంచి వచ్చిన డీపీఎల్ఎం మోహన్ ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, గ్రామాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


బల్లికురవ మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ తదితరులు